ప్రజాశక్తి

ఆదివారం 4 డిసెంబరు 2022 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

వికలాంగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడ : వికలాంగులకు ప్రభుత్వం కల్పించిన చట్టాలు, హక్కులపై అవగాహన కలిగివుండాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు తెలిపారు. జిల్లా వయోవృద్ధులు, హిజ్రాలు, వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు మాట్లాడుతూ సంస్థలు, ఆసుపత్రులు, పాఠశాలలో వికలాంగుల పట్ల వివక్షతో నిర్లక్ష్యం చేస్తే సెక్షన్ 92 ప్రకారం కేసులను నమోదు చేయవచ్చన్నారు. విద్యా,ఉపాధి, ఉపకారణాల పంపిణీలో ముందంజలో ఉన్నప్పటికి వారి పట్ల ఇంకను మెరుగైన వాతావరణం కల్పించాల్సిన అవసరం వుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన స్థానిక శాసనసభ్యులు మల్లాది విష్ణువర్ధన్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాల్లో ప్రతిభతో రాణిస్తూ ప్రతిభావంతులుగా పేరును సార్ధకం చేసుకుంటున్నారన్నారు. వికలాంగుల సంక్షేమ శాఖ ఎమ్‌డి.ఎం.ఎ.కుమార్ రాజా పాల్గొన్నారు.

అనుసంధాన రోడ్లు అధ్వానం

రూ.147 కోట్ల ఎన్‌డిబి పనుల్లో పురోగతి నిల్

రెండేళ్లలో జరిగింది రూ. 14 కోట్ల పనులు మాత్రమే



ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

గ్రామీణ ప్రాంతాల్లోని మండల కేంద్రాలకు అనుసంధాన రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. జిల్లాలో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డిబి) నిధులతో నిర్మిస్తున్న మూడు రహదారి ప్రాజెక్టులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు మొదలెట్టి రెండేళ్లయినా 10 వంతు మాత్రమే పూర్తయ్యాయి. ఈ రోడ్లు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

రహదారులు భవనాలశాఖ (ఆర్‌అండ్‌బి) మచిలీపట్నం, గుడివాడ డివిజన్లలో 49.19 కిలోమీటర్లు మేర మూడు రహదారులు విస్తరణ, నిర్మాణానికి ఎన్‌డిబి నిధులు రూ.147 కోట్లు మంజూరయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన సంవృద్ధి కన్‌స్ట్రక్షన్ సంస్థ 2020 ఆగస్టులో ఈ రోడ్ల నిర్మాణానికి టెండర్లను దక్కించుకుంది. మచిలీపట్నం నియోజకవర్గంలోని మచిలీపట్నం – కమ్మవారిచెరువు – వయా చిన్నాపురం మధ్య 13.4 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణాన్ని రూ.52 కోట్లతో చేపట్టారు. రూ.4 కోట్ల విలువైన పనులు మాత్రమే జరిగాయి. పెడన నియోజకవర్గంలోని నడుపూరు–వాడవల్లి మీదుగా కోరుకొల్లు వరకు 19.30 కిలోమీటర్లు రూ.55 కోట్లతో రోడ్డు విస్తరణ చేపట్టారు. కానీ పనులు ఇంత వరకూ ప్రారంభంకాలేదు. గుడివాడ ఆర్‌అండ్‌బి డివిజన్లోని పామర్రు నియోజకవర్గం కౌతవరం–నిడుమోలు–ఐలూరు రోడ్డు 16.49 కిలోమీటర్ల మేర అభివృద్ధికి రూ.40 కోట్లు విలువైన పనులు చేయాల్సి ఉంది. రూ.10 కోట్లు పనులు జరిగాయి. ఇరుకుగా ఉన్న ఈ రోడ్లులో బస్సు సర్వీసులు నడపడం, ఆటోలు వెళ్లడానికి సమస్యగా మారింది. విస్తరణ, అభివృద్ధితో ఈ సమస్య పరిష్కారం అవుతుందని ఆశించారు. అయితే పనుల్లో పురోగతి లేకుండా పోవడంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

బిల్లు చెల్లింపులపై నిర్లక్ష్యమే కారణమా ?

నిర్దేశించిన మొత్తంలో వర్కులు పూర్తయిన తర్వాత కాంట్రాక్టు సంస్థకు ఎప్పటికప్పుడు పార్ట్‌టైం బిల్లులు చెల్లించాలి. రెండు రోడ్లకు సంబంధించి రూ.14 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. ఈ బిల్లులు పెండింగ్‌లో పెట్టడంతో కాంట్రాక్టు సంస్థ పనులు నిలిపివేసినట్లు తెలిసింది. వెంటనే బిల్లులు చెల్లించి కాంట్రాక్టు సంస్థ రహదారుల విస్తరణ పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నేడు విఎంసి ఎంప్లాయీస్ సొసైటీ ఎన్నికలు

8 నుంచి 2 గంటల వరకు పోలింగ్

రాత్రికి ఫలితాలు వెల్లడి

ప్రొగ్రెసివ్ ఫ్రంట్-ఈశ్వర్ ప్యానల్ మధ్యే ప్రధాన పోటీ

ప్రజాశక్తి - విజయవాడ : ది విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ (విఎంసి) కార్పొరేషన్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు ఆదివారం జరుగుతాయి. ఇందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 8 మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మధ్యాహ్నం 2.30 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. రాత్రికి ఫలితాలను వెల్లడిస్తారు. హనుమాన్‌పేటలోని జంధ్యాల దక్షిణామూర్తి మునిసిపల్ హైస్కూల్‌లో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. దీనిలో మూడు పోలింగ్ బూత్‌లు ఉంటాయి. ఎన్నికల అధికారిగా రిటైర్డ్ డిప్యూటీ రిజిస్ట్రార్ యం.జె. ఏసుదాస్ వ్యవహరిస్తున్నారు. ఎన్నికల అధికారితోపాటు కో ఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ మాధవరావు తమ సిబ్బందితో పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లను పూర్తి చేశారు. 20 మంది పోలింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ బూత్‌కు ఐదుగురు చొప్పున సిబ్బందిని కేటాయించగా, మరో ఐదుగురు రిజర్వుడు స్టాఫ్‌ను ఏర్పాటు చేశారు. రిజిస్ట్రార్ కార్యాలయం స్టాఫ్‌ను పోలింగ్ నిర్వహణకు వినియోగిస్తున్నారు. గవర్నర్‌పేట పోలీసు అధికారులు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈసారి సొసైటీ పరిధిలో 1536 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గతసారి జరిగిన ఎన్నికల్లో1889 మంది ఓటర్లు ఉండగా,ఉద్యోగ విరమణ చేసిన వారు, మృతి చెందిన వారు ఉండడం తదితర కారణాతో ఈసారి 353 మంది ఓటర్లు తగ్గారు. మొత్తం 3,600 మంది వివిధస్థాయిల్లోని పర్మినెంట్ ఉద్యోగులుండగా, వీరిలో 1536 మందికి మాత్రమే సొసైటీలో సభ్యత్వం ఉంది. వీరికి మాత్రమే ఓటు హక్కు ఉంటుంది. ప్రతి ఓటరు 11 మంది డైరెక్టర్లకు ఓటు వేయవచ్చు. ఒక ఓటు నుంచి 11 ఓట్లు లోపు మాత్రమే ప్రతి ఓటరు వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఈసారి మూడు ప్యానల్స్ తరుపున మొత్తం 37 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. వీరికి కేటాయించిన గుర్తులను బ్యాలెట్ పేపర్‌పై ఓటరు తమకు నచ్చిన 11 మందికి ఓట్లు వేసుకోవచ్చు. సొసైటీకి 11 మంది డైరెక్టర్లను ఎన్నుకోవాల్సి ఉంటుంది. మొదటి పోలింగ్ బూత్‌లో 536 మంది ఓట్లు, రెండో బూత్‌లో 500 ఓట్లు, మూడో బూత్‌లో 500 ఓట్లు ఉన్నాయి.

11 మంది డైరెక్టర్ల పదవులకు 37 మంది పోటీ

11 మంది డైరక్టర్లకుగాను 37 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రస్తుత సిటింగ్ ప్యానల్ (ప్రొగ్రెసివ్ ప్యానల్) తరుపున 11 మంది, ఈశ్వర్‌ప్యానల్ తరుపున 11 మంది, విఎంసి ఎంప్లాయీస్ మినిస్ట్రీరియల్ అండ్ ఆల్‌ఎంప్లాయీస్ అసోసియేషన్ బలపరిచిన ప్యానల్ తరుపున 10 మంది, మరో ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగారు. గతసారి ప్రొగ్రెసివ్ ప్యానల్, ఈశ్వర్‌ప్యానల్ రెండు ప్యానల్స్ మాత్రమే పోటీలో ఉండగా, ఈసారి మూడు ప్యానల్స్ ఎన్నికల బరిలో ఉన్నాయి. ప్రస్తుతం ప్రధానంగా రెండు ప్యానల్స్ మధ్యలోనే పోటీ నెలకొన్నట్లు తెలుస్తుంది. సిటింగ్ ప్యానల్ అయిన ప్రొగ్రెసివ్ ప్యానల్, ఈశ్వర్ ప్యానల్ మధ్యనే రసవత్తరమైన పోటీ నెలకొంది. మూడో ప్యానల్ కొంత వరకు ఓట్లు చీల్చినా కానీ డైరెక్టర్లను గెలిపించుకునే అవకాశం ఉండకపోవచ్చుననే దిశగా ఓటర్లలో చర్చ జరుగుతుంది. గత నెల 18న ఎన్నికల షెడ్యూల్ విడుదలయిన దగ్గర నుంచి మూడు ప్యానల్స్ ప్రచారాన్ని ప్రారంభించి, చివరి వరకు పెద్దఎత్తున ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరికీ లోను సదుపాయం కల్పించే దగ్గర నుంచి బ్యాంక్ నిర్వహణ, లావాదేవీల పర్యవేక్షణ, అటు కార్పొరేషన్, ఇటు ఉద్యోగులకు కల్పిస్తున్న సదుపాయాలు, ఓటర్లతో ఉన్న సన్నిహిత సంబంధాలు, ప్రధానంగా జరిగిన ఎన్నికల ప్రచారం ... ఇవన్నీ ఓటర్లపై ప్రభావం చూపుతుంటాయి. ఈఅంశాల దృష్ట్యా అభ్యర్థుల బలబలాలను పరిశీలిస్తే నెగిటివ్ ఓటు లేనందున ఈసారి కూడా సిటింగ్ ప్యానల్ వైపే ఓటర్లలో మొగ్గు ఉండవచ్చునని ప్రచారం జరుగుతోంది.



ఎన్నికల ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

దొంగనోట్ల ముఠా అరెస్టు

ప్రజాశక్తి-పంగులూరు (బాపట్ల జిల్లా): దొంగ నోట్లు ముద్రించే ముగ్గురు వ్యక్తులను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాపట్ల జిల్లా మండల కేంద్రమైన పంగులూరు గ్రామంలో దొంగ నోట్లు ముద్రించే ముగ్గురు వ్యక్తులను శుక్రవారం రాత్రి విజయవాడకు చెందిన క్రైమ్‌బ్రాంచ్ పోలీసులు తీసుకెళ్లారు. దొంగ నోట్లు ముద్రించే మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ విషయం గ్రామంలో వ్యాపించి కలకలం రేపింది. రేణింగవరం ఎస్సై కథనం ప్రకారం... కష్ణా జిల్లా గుడివాడలో దొంగ నోట్లు మారుస్తూ ,ఒక వ్యక్తి పోలీసులకు దొరికిపోయాడు. ఆ వ్యక్తిని పట్టుకొని దొంగ నోట్ల ముఠా సభ్యుల వివరాలు తెలుసుకున్న పోలీసులు, ఆ వ్యక్తిని తీసుకొని శుక్రవారం రాత్రి పంగులూరు వచ్చారు. అతను చెప్పిన వివరాల మేరకు, పంగులూరు గ్రామంలో ఇద్దరినీ, పక్కనే ఉన్న ఆరికట్ల వారిపాలెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు. పంగులూరు లోని ఒక ఇంటిలో ఉంచిన దొంగ నోట్లు ముద్రించే యంత్రాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకొని తీసుకెళ్లినుట్ల తెలిసింది. అయితే పంగులూరులో ముద్రించి బయటికి తీసుకెళ్లి చలామణి చేస్తున్నారా లేక ఇక్కడ కూడా ముద్రించాలని కొత్త మిషన్ తీసుకొచ్చారా అన్నది తెలియరాలేదు. ఇటీవల కాలంలో పంగులూరులో ఉన్న ఏటీఎంలలో కూడా, దొంగ నోట్లు వస్తున్నట్లు కొంతమంది చెబుతున్నారు. దీన్నిబట్టి ఈ ప్రాంతంలో దొంగ నోట్లు చలామణి ఎక్కువగా జరుగుతున్నట్లు ప్రజలు భావిస్తున్నారు.

ఐక్యపోరాటం ద్వారానే ఉద్యోగుల సమస్యల పరిష్కారం

ఎపిఎన్‌జిఒ అధ్యక్షులు విద్యాసాగర్ : నగర శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండా ఏపి ఎన్‌జివో అసోసియేషన్ పనిచేస్తుందని ఉద్యోగ సమస్యలపై చేపట్టే పోరాటాలలో విజయవాడ నగర శాఖ కీలక పాత్ర వహిస్తుందని ఏపిఎన్‌జివో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఏ. విద్యాసాగర్ అన్నారు. ఏపిఎన్‌జివో నగర శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం విజయవాడ గాంధీనగర్‌లోని ఏపిఎన్‌జివో హోమ్‌లో నిర్వహించారు. నగర కార్యవర్గానికి ఎన్‌జివో జిల్లా అధ్యక్షులు ఏ విద్యాసాగర్ బలపరచిన అభ్యర్థులు ఎన్‌జివో హోమ్ నుండి అలంకార్ సెంటర్ మీదుగా ర్యాలీగా బయలుదేరి తిరిగి ఎన్‌జివో హోమ్‌కు చేరుకుని ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కార్యవర్గంలోని ఒక్కొక్క పదవికి ఒక్కో అభ్యర్థి నామినేషన్ వేయడంతో పోటీలో ఉన్న అభ్యర్థులు గెలిపొందిన్నట్లు ఎన్నికల అధికారి యండి ఇక్బాల్ ప్రకటించారు. నగర శాఖకు ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులు ఏపిఎన్‌జివో అసోసియేషన్ విజయవాడ నగర శాఖకు అధ్యక్షులుగా (మిగతా 6లో)



నూతన కార్యవర్గం

పేదల సమస్యల పట్టని ప్రభుత్వం

• 'ఇదేం కర్మ రాష్ట్రానికి' కార్యక్రమంలో మాజీ మంత్రి ఉమా

ప్రజాశక్తి-మైలవరం
పేదల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. 'ఇదేం కర్మ రాష్ట్రానికి' అనే కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం మైలవరంలోని దేవుని చెరువులో పర్యటించారు. ఈ సందర్భంగా రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయని, అర్హత ఉన్న పింఛన్ రావడం లేదని పలువురు వాపోయారు. అనంతరం ఉమా మాట్లాడుతూ పేదలపై భారాల మోపుతున్న ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం** : రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ వైసిపి పాలనలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ వారిని చైతన్యపరిచే కార్యక్రమం ఇదేం ఖర్మ రాష్ట్రానికి అని రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని జూపూడి (కిలేశపురం)లో శనివారం ఆయన 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య, నిత్యావసర ధరల పెరుగుదల, మద్యపానం, మాదకద్రవ్యాల నిషేధం, కుంటుపడిన అభివృద్ధి, ఇసుక మాఫియా, తాగునీటి సమస్యవంటి 14 అంశాలపై ప్రజాభిప్రాయాన్ని సేకరించడం ప్రారంభించామన్నారు. 2014 ఎన్నికల్లో ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని ఏ విధంగా పాలిస్తున్నాడో అందరూ గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి- విజయవాడ రూరల్** : విజయవాడరూరల్ మండలంలోని నున్న గ్రామంలో గల ఇందిరా కాలనీలో శనివారం 'ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న గన్నవరం నియోజకవర్గ ఇన్చార్జి బచ్చుల అర్జునుడు మాట్లాడుతూ ఎనిమిది లక్షల కోట్లు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్ గా పేరు తెచ్చిన ఘనత వైఎస్ఆర్ పార్టీకే చెల్లిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గొడ్డల చిన్న రామారావు, పార్టీ జిల్లాఉపాధ్యక్షులు దండు సుబ్రహ్మణ్యం రాజు, మచిలీపట్నం పార్లమెంటు ఉపాధ్యక్షులు గుజ్జర్లపూడి బాబూరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు గంప శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

రేషన్‌డీలర్ మృతి

ప్రజాశక్తి వీరులపాడు : మండలంలో జుజ్జూరు గ్రామానికి చెందిన సీనియర్ సివిల్ సప్లై డీలర్ బాలస్వామి(60) అనారోగ్యంతో శనివారం విజయవాడ ప్రైవేట్ ఆస్పత్రిలో మతి చెందారు. గ్రామంలో 30 సంవత్సరాల నుండి ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యవసర సరుకులు ప్రజలకు అందజేయడంలో బాలస్వామి ప్రజల మన్నెలు పొందారు. ఆయనకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. బాలస్వామి మతికి పలు పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి లాల్ అహ్మద్ గౌస్, రాష్ట్ర రేషన్ డీలర్స్ నాయకులు దేవరకొండ శ్రీనివాసరావు తదితరులు సంతాపం తెలియజేసిన వారిలో ఉన్నారు.

బాలికపై అత్యాచారయత్నం

• ఫోక్సో యాక్ట్ కింద కేసు నమోదు

ప్రజాశక్తి-కంచికచర్ల : బాలికపై 60 ఏళ్ళ వృద్ధుడు అత్యాచారం చేయబోయిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు స్థానిక యస్ ఐ పివియస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక వసంత కాలనీకి చెందిన టి నరశింహస్వామి అనే వృద్ధుడు ఆ కాలనీకి చెందిన ఓ బాలికకు కొంత కాలంగా బిస్కెట్లు తెచ్చుకో...నాకు సిగరెట్లు తెచ్చి పెట్టు అంటూ మచ్చిక చేసుకున్నాడు. శనివారం మధ్యాహ్నం చుట్టుపక్కల ఎవరూ లేని సమయంలో ఆ బాలికకు కొంత చిల్లర డబ్బులు ఇచ్చి ఇంట్లోకి తీసుకెళ్ళి బలవంతం చేయబోయాడు. దీంతో ఆ బాలిక కేకలు వేస్తూ ఇంటికి పరుగెత్తి కుటుంబ సభ్యులకు జరిగిన విషయం చెప్పింది. దీంతో బాలిక కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా వృద్ధుడిపై ఫోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కృష్ణానదిలో దూకి యువతి గల్లంతు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ప్రకాశం బ్యారేజ్ కృష్ణా నదిలో దూకి ఓ యువతి గల్లంతైన సంఘటనపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు విజయవాడ చిట్టినగర్ సాయిరామ్ దగ్గర, భీమన్నవారి పేట, ఆంజనేయస్వామి గుడి వెనుక యజ్జ పద్మప్రియ కుటుంబం నివాసం వుంటున్నారు. ఈమె కుమార్తె కొనిమకోట ఉదయశ్రీ (21) నాలుగేళ్ళ క్రితం కామయ్యతోపు గ్రామానికి చెందిన కొనిమకోట నాగేంద్రతో ప్రేమ వివాహం చేసుకుంది. వారికి ఒక పాప. అయితే కొనిమకోట ఉదయశ్రీ, నాగేంద్రల మధ్య మూడేళ్లగా గొడవలు రావటంతో భార్యాభర్తలు విడివిడిగా ఉంటున్నారు. ఎనికేపాడు వద్ద సుమారు నెలరోజుల నుండి ఉదయశ్రీ నివాసం వుంటూ అలెన్ సోలీ అనే షాపులో పనిచేస్తుంటుంది. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఎవరో ఒక వ్యక్తి ఫోన్ చేసి ప్రకాశం బ్యారేజి 36, 37 ఖానాల మధ్యన బ్యారేజికి తూర్పువైపుగా నీళ్లలో తమ కుమార్తె ఉదయశ్రీ దూకేసిందని ఫోన్ చేశారని ఉదయశ్రీ తల్లి పద్మప్రియ తెలిపారు. దీంతో పద్మప్రియ అక్కడకు వెళ్ళి చూడగా బ్యారేజి మీద వదిలిన సెల్ ఫోన్, పాపులో పనిచేస్తూ వేసుకొను డ్రెస్సు, ఐడి కార్డు, షూస్‌లను చూసి అవి మా ఈ అమ్మాయివి చెందినవిగా గుర్తు పట్టినట్లు పద్మప్రియ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టారు.

సొసైటీ భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కంచికచర్ల
కంచికచర్లలో 32 లక్షల రూపాయల వ్యయం తో నూతనంగా నిర్మించనున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) భవన నిర్మాణానికి నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు శనివారం శంకుస్థాపన చేశారు. శిధిలావస్థకు చేరిన భవనం కూల్చి దాని స్థానంలో కెడిసిసి బ్యాంకు నిధులతో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కెడిసిసి బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సొసైటీ ఛైర్మన్ కాలవ వెంకటేశ్వర రావు, తహశీల్దార్ వి రాజకుమారి, కెడిసిసి బ్యాంకు డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, డీసియంయస్ డైరెక్టర్ బండి జానకి రామయ్య, యంపిపి బషీర్, వైస్ ఎంపిపి బండి మల్లిఖార్జున రావు, జడ్పీటీసీ వేల్పుల ప్రశాంతి, ఆమర్లపూడి కీర్తి సౌజన్య, యంపీడీఓ కె బాల శంకరరావు, సర్పంచ్ వేల్పుల సునీత తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశానికి అధికారుల గైర్హాజరు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్తు అధ్యక్షురాలు రామినేని దేవి ప్రావిణ్య వీరస్వామి నాయుడు అధ్యక్షతన శనివారం నాడు మండల పరిషత్తు కార్యాలయ సభ మందిరంలో జరిగింది. కాగా ఈ సభకు కొన్ని శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జడ్పీటిసి సభ్యులు పాలంకి విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు సర్వసభ్య సమావేశానికి రావడానికి ఎందుకు ఆసక్తి చూపడం లేదో తెలియటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశాలకు అధికారులు రానిపక్షంలో సభ నిర్వహించుకోవడం అనవసరం అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మైలవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి,వైస్ ఎంపీపీ చాట్ల రాబర్ట్, పాటిబండ్ల సత్యనారాయణ, ఎండిఓ పి శంకర్రావు, కొన్ని శాఖల అధికారులు సర్పంచులు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం పూర్తి చేయాలి

ప్రజాశక్తి-మైలవరం : ఓటర్ కార్డుకు ఆధార్ కార్డు అనుసంధాన ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని జెడ్పి సీఈవో జె శ్రీనివాసరావు బూత్ లెవల్ అధికారులకు సూచించారు. స్థానిక ఎస్వీఎస్ కళ్యాణమండపం లో శనివారం ఎలక్షన్ ఓటర్ లిస్ట్ కు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం 6 ద్వారా కొత్త ఓటరు నమోదు, చనిపోయిన వారిని గ్రామం నుంచి శాశ్వతంగా వెళ్లిపోయిన వారిని ఓటర్ లిస్ట్ నందు గుర్తించి ఫారం సెవెన్ ద్వారా తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం, జి కొండూరు, రెడ్డిగూడెం తహసీల్దార్లు, సూపర్వైజర్లు బిఎల్వోలు పాల్గొన్నారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యం కావాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్
కళాశాల విద్యాబోధనలో విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యం కావాలని చెన్నై లయోలా కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ ఎక్స్ మహిమైరాజ్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యంలో బోధనాసిబ్బంది నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా 'విద్యార్థుల సమగ్రాభివృద్ధి' అంశంపై సదస్సును ఆ కళాశాల ప్రాంగ ణంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ. నారాయణరావు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి. కృష్ణవేణి స్వాగతం పలికారు. వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనపర్చిన విద్యార్థికి సన్మానం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట
పట్టణానికి చెందిన విద్యార్థి నక్కా కుమార్ బాబు జాతీయ స్థాయిలో జరిగిన నీట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చి ఎంబిబిఎస్ సీటు పొందిన సందర్భంగా శాసనసభ్యులు సామినేని ఉదయభాను ఆ విద్యార్థిని, అతని తండ్రిని తన స్వగృహంలో సన్మానిచ్చారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్య పేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కళా శాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో సినీ నటి హెబ్బాపటేల్ సందడి

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్
సినీ నటి హెబ్బా పటేల్ విజయవాడలో సందడి చేశారు. ఎంజి రోడ్ లో రెనోవేట్ చేసిన శుభమస్తు షాపింగ్ మాల్ ను సినీ నటి హెబ్బా పటేల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. షో రూమ్ లో ఉన్న విభిన్న రకాల వస్త్ర శ్రేణిను, చీరలను ఆసక్తిగా తిలకించారు. షో రూమ్ విజయవంతంగా నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వాహ కులను అభినందించారు. ఈ సందర్భంగా శుభమస్తు షాపింగ్ మాల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి బయ్యా వాసు మాట్లాడుతూ క్రిస్మస్, సంక్రాంతిని పురస్కరించుకొని ప్రతి రోజు వెయ్యి రూపాయల పైబడి కొనుగోలు చేసిన వారికి కూపన్లు ఇచ్చి లక్కీ డ్రా తీసి ఒక ఎలక్ట్రిక్ స్కూటర్ ఇస్తారన్నారు. జనవరి 15 వరకు ప్రతి రోజు డ్రా జరుగుతుం దన్నారు. డిసెంబర్ 25 , జనవరి 15 న బంపర్ డ్రా తీసి కారు బహుమతిగా ఇస్తామన్నారు. వన్ ప్లస్ వన్, వన్ ప్లస్ టు ఆఫర్ల ను అందిస్తున్నామని చెప్పారు.

వికలాంగుల సంరక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలి : జడ్జి

ప్రజాశక్తి-నందిగామ : వికలాంగుల సంరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నందిగామ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీ రాజ్యం అన్నారు. వికలాంగుల దినోత్సవం సందర్భంగా శనివారం నందిగామ చైతన్య కాలేజీలో నందిగామ మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీ రాజ్యం మాట్లాడుతూ వికలాంగుల దినోత్సవం సందర్భంగా వారి సంక్షేమానికి ప్రభుత్వం అనేక నిధులు మంజూరు చేస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలు పట్ల ఓపికతో ఉండాలని కోరారు. వికలాంగుల సంక్షేమానికి అనేక చట్టాలు ఉన్నాయని, చట్టాలు పట్ల అవగాహన పెంచుకోవాలని కోరారు. చైతన్య కాలేజ్ ప్రిన్సిపాల్ అమరనేని కార్తిక్, నందిగామ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నెకంటి జీవరత్నం,కార్యదర్శి ఫణి కుమార్, కొణకంచి శ్రీనివాసరావు,గుర్రాల వెంకటరత్నం, గింజుపల్లి రమేష్,మట్టా ప్రసాద్, గోపి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గంపలగూడెం** : వృద్ధులు వికలాంగులకు దానం చేస్తే వచ్చే ప్రశాంతత అంతా ఇంత కాదని కనుమూరు గ్రామ సర్పంచ్ మంద మారేశ్వరి తెలిపారు. శనివారం వికలాంగుల దినోత్సవం పురస్కరించుకొని గ్రామంలో తిరువూరు ఏఎంసి డైరెక్టర్ వజ్రాల శ్రీనివాసరెడ్డి దంపతుల సారధ్యంలో వందమంది వద్దులు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అట్లూరి వెంకట కష్టారెడ్డి, పూర్వపు వితరణ దాత అత్తునూరి వెంకట శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.**ప్రజాశక్తి -కంచికచర్ల** : అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక భవిత సెంటర్ లో శనివారం వికలాంగులకు ట్రై సైకిళ్ళు, వినికిడి యంత్రాలను నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగవైకల్యం కలిగి శాస్త్రవేత్తలుగా ఎదిగిన సంజీవయ్య శర్మ, థామస్ ఆల్వాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కెడిసిసి బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, యంపిపి బషీర్, వైస్ ఎంపిపి బండి మల్లిఖార్జున్ రావు, జడ్పీటీసీ వేల్పుల ప్రశాంతి, తహశీల్దార్ వి రాజకుమారి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-వత్సవాయి** : వత్సవాయిలోని స్థానిక భవిత సెంటర్‌లో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకలు నిర్వహించారు. అనంతరం గత మూడు రోజులుగా నిర్వహించిన డాన్స్, డ్రాయింగ్, ఆటపాటల పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు, ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎంపిపియస్ మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్ పుల్లయ్య, సిఆర్పీ రవిబాబు, ఐఈఆర్పి డి. ఉదయలక్ష్మి, ఎస్. శ్రీ విష్ణు దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం** : ఇబ్రహీంపట్నం ఫెర్రిలోని ఎంపియుపిఎస్ భవిత పాఠశాలలో అంత ర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ వేడుక సందర్భంగా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించారు. డ్రాయింగ్ రన్నింగ్ డాన్స్ ప్రోగ్రాం నందు ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పుష్పలత, ఫెర్రి స్కూల్ ఉపాధ్యాయులు ఐఈఆర్‌టి టీచర్లు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు** : స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల చింతల తోపు భవిత సెంటర్ నందు



ప్రసంగిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీ రాజ్యం

శనివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా దివ్యాంగుల చిన్నారులకు వివిధ రకాల ఆటలు, పాటలు పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్కపుడి గాంధీ, ఎంఈఓ రవీంద్ర నాయక్, ఉపాధ్యాయులు వరలక్ష్మి శివ పార్వతి సిఆర్పిలు గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-జగ్గయ్యపేట** : ప్రతిభావంతులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయంలో లేప్రా సొసైటీ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మున్సిపల్ కమిషనర్ జయరాములుకు విభిన్న వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లెప్రా సొసైటీ స్టేట్ కో ఆర్డినేటర్ రాధిక, లెప్రా సొసైటీ సీఈవో ప్రశాంత్ కుమార్ నాయక్ లు మాట్లాడుతూ లెప్రసీ ద్వారా అంగవైకల్యం కలిగిన వారికివివిధ సంస్థలను సమన్వయం చేసుకొని పూర్తి నైపుణ్యం మరియు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తమ సంస్థ ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వహీద్, వాళ్ల హరీష్ మెడికల్ అధికారి నాగరాణి, సురేష్, కోటేశ్వరరావు తదితర ప్రతినిధులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌ను గద్దె దించాలి : టిడిపి

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రజల గోడు పట్టించుకోకుండా మూర్ఖంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డిని ఆ పదవి నుంచి గద్దె దించటానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని పలువురు టిడిపి నాయకులు పిలుపునిచ్చారు. టిడిపి జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు 'ఇదేమి కర్మ రాష్ట్రానికి' పేరుతో ఆ పార్టీ నాయకులు శనివారంనాడు ప్రచార కార్యక్రమాలను నిర్వహించారు. **కోడూరు :** మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన'ఇదేమి కర్మ రాష్ట్రానికి' కార్యక్రమం కోడూరు తొమ్మిదో వార్డులో జరిగింది. టిడిపి కోడూరు మండల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఆదేశానుసారం ప్రజల సమస్యలను వివరంగా అడిగి తెలుసుకుని నివేదిక తయారు చేస్తున్నారు. ఈకార్యక్రమంలో స్థానిక బూత్ కన్వీనర్ బొడ్డు వెంకన్న, మాజీ ఎంపిటిసి బడే వీరబాబు, తెలుగు యువత బడే గాంధీ, బండే వెంకటేశ్వరరావు, మేడ శివాజీ తదితరులు పాల్గొన్నారు. **హనుమాన్ జంక్షన్ :** మండల కేంద్రమైన బాపులపాడులో యూనిట్ ఇంచార్జ్ తుమ్మల జగన్ సహకారంతో 'ఇదేమి కర్మ రాష్ట్రానికి' కార్యక్రమం శనివారం జరిగింది. టిడిపి గన్నవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బచ్చుల అర్జునుడు మాట్లాడారు. నిరుద్యోగ సమస్య, నిత్యావసర ధరల పెరుగుదల, మద్యపానం, మాదకద్రవ్యాల నిషేధం, కుంటుపడిన అభివృద్ధి, ఇసుక మాఫియా, తాగునీటి సమస్య, అవినీతి, మహిళల భద్రత, విద్యుత్ సమస్య, దుర్భరమైన రోడ్లు, నిధుల దుర్వినియోగం, గిట్టుబాటు ధరలు, రాజధాని రాజకీయాలు, నిలకడలేని పాలన వంటి 14 అంశాలపై ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నామని నాయకులు తెలిపారు. సాగునీటి సమైక్య సంఘాల రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల గోపాలకృష్ణ, మండల అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి పొట్ల సురేష్, టౌన్ ప్రధాన కార్యదర్శి గార్లపాటి రాజేశ్వరరావు, చలసాని శ్రీనివాసరావు, మండాది రవీంద్ర, గండేపూడి నితీష్ కుమార్,యలమంచిలి మూర్తి, పొట్లూరు ఫణి, దయాల సుహాస్, కత్తుల జాన్సన్, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. **ఉయ్యూరు :** రాష్ట్రప్రభుత్వ వైఖరి, రాజకీయ కక్ష సాధింపుతో రాష్ట్రంలో పరిశ్రమలు ఇరత రాష్ట్రాలకు తరలి పోతుంటే ఉద్యోగాలు లేక యువత వలసవెళ్లే దౌర్భాగ్య స్థితి దాపురించిందని మాజీ ఎమ్మెల్యే బోడెప్రసాద్ ఆందోళన వ్యక్తంచేశారు. టీడీపీ చేపట్టిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా శనివారం ఉయ్యూరు పట్టణ 16వ వార్డులో పర్యటించి వైసీపీ ప్రభుత్వ అసమర్థ పాలన ఎండగట్టి ప్రజాసమస్యలు తెలుసుకున్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు జంపాన గుర్నాధరావు, మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, జంపాన రుద్రయ్య, మండలపార్టీ అధ్యక్షుడు కుటుంబరావు, తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి, పార్టీ నాయకులు ఈడే అంజిబాబు, సుబ్బారావు, చిరంజీవి, కాగిత కొండ, వీరంకి శివాజీ, వాసు, అప్పలనాయుడు, రఫీ, జయదేవ్ పాల్గొన్నారు. **పెదపారుపూడి :** పెదపారుపూడి మండలంలోని దోసపాడు, నాగాపురం గ్రామాల్లో టిడిపి ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్ల కుమార్ రాజా మాట్లాడారు. టిడిపి పెదపారుపూడి మండల అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి (చంటి), సీనియర్ నాయకులు చెరుకూరి విజయ్ కుమార్, గుండపునేని శ్రీనివాసరావు (స్వామి), మాజీ ఎంపీపీ కాజా విజయలక్ష్మి, కలపాల కిషోర్, గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తోందని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్ విమర్శించారు. టిడిపి ఆధ్వర్యంలో 'ఇదేమి కర్మ' కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని దక్షిణచిరువోల్లంక గ్రామంలో బుద్ధప్రసాద్ శనివారం పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైసిపి ప్రభుత్వ దమనకాండ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు బచ్చు రాఘవయ్య, మాజీ సర్పంచ్ మతి నాగేశ్వరరావు, సనకా బసవయ్య, బచ్చు మురళి, సనకా రాజమోహనరావు, ఇమ్మాడ బత్తిన వెంకటరమణ, సాయి కృష్ణ, కనక వెంకటరమణ, బచ్చు రఘునాథ్, అడపా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


అవనిగడ్డలో


ఉయ్యూరులో


పెదపారుపూడిలో


కోడూరులో



హనుమాన్‌జంక్షన్‌లో

క్రీడాకారులకు నూతన క్రికెట్ కిట్లు బహూకరణ

ప్రజాశక్తి-పెడన

ఈనెల 21వ తారీకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి లో జగనన్న క్రీడా సంబరాల్లో భాగంగా పెడన బొడ్డు నాగయ్య కాలేజీలో వివిధ క్రీడలకు సంబంధించిన సెలెక్షన్స్ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ సూచనలు మేరకు యువ నాయకుడు జోగి రాజీవ్ క్రికెట్ టోర్నమెంట్లో తలపడే పెడన క్రీడాకారులకు నూతన క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెడన పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


కిట్లు పంపిణీచేస్తున్న జోగి రాజీవ్

బిసి మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన ఉదయం 9 గంటలకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న జయహో బీసీ మహాసభ పోస్టర్లను అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు ఆవిష్కరించారు. పార్టీ కార్యాలయం వద్ద ఈ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బీసీలు రాష్ట్రానికి వెన్నెముక లాంటి వారన్నారు. బీసీల అభ్యున్నతికి సీఎం జగన్ మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. చట్టసభల్లో కూడా బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ నెల 7వ తేదీన జరిగే జయహో బీసీ మహాసభను జయప్రదం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు నులకుర్తి రమేష్, జిల్లా అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, జెడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంపీపీ తుంగల సుమతీదేవి, గ్రామ సర్పంచ్ గోరుముచ్చు ఉమా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్

ఈనెల ఏడోతేదీన విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో వైయస్సార్ పార్టీ వైభవంగా నిర్వహిస్తున్న జయహో బీసీ మహాసభను విజయవంతం చేయాలని గన్నవరం శాసనసభ్యులు డాక్టర్ వల్లభనేని వంశీ పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి గురువారం హనుమాన్ జంక్షన్ లో బీసీ మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బాపులపాడు ఎంపీపీ యరగొర్ల నగేష్, జెడ్పీటీసీ కొమరవల్లి గంగాభవాని, బాపులపాడు సర్పంచ్ సరిపల్లి కమలా కిరణ్, నక్కా గాంధీ, అవిర్నేని శేషగిరిరావు, తాడి లక్ష్మణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కుష్టుపై సమగ్ర అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-ఉయ్యూరు

కుష్ఠ వ్యాధి సర్వే సక్రమంగా చేపట్టి దానిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని లెప్రసీ అడిషనల్ డైరెక్టర్ జె.యశ్విన్ సిబ్బందికి సూచించారు. కుష్ఠ వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా శనివారం అధికారుల బృందం కాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించింది. వైద్య, ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేసింది. కుష్ఠ వ్యాధిపై సర్వే సోమవారంతో ముగియనున్న సందర్భంగా మండల పరిధి గ్రామాల్లో సర్వే సంపూర్ణంగా చేయాలన్నారు. దీని నిర్మూలనకు పూర్తిగా మందులు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా ఇస్తున్నామన్నారు. మందులు సక్రమంగా వాడి వ్యాధి తగ్గించుకోవచ్చని సూచించారు. జిల్లా కుష్ఠువ్యాధి నిర్మూలన అధికారి టి.వేణుగోపాల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి జె.దీప, నాగార్జున బాబు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పరిశీలన

ప్రజాశక్తి-చల్లపల్లి

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్మించిన అర్ బి కె లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా సహకార అధికారి వి. ఫణికుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.రాము శనివారం తనిఖీ చేశారు మండల పరిధిలోని కొత్త మాజేరు పి ఎ సి ఎస్ ను సందర్శించి రికార్డులను పరిశీలించారు , రైతుల దగ్గరనుండి ధాన్యం ఏవిధంగా కొనుగోలు చేస్తున్నారో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పి ఎ సి ఎస్ చైర్ పర్సన్ అరజా. శివశంకర్, సి ఇ ఓ ఎస్. ఎస్. చక్రపాణి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎస్. మనీష మరియు సిబ్బంది పాల్గొన్నారు

సంక్షేమ పథకాల అమలులో దేశానికి సిఎం ఆదర్శం : సింహాద్రి

ప్రజాశక్తి-అవనిగడ్డ

సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దేశానికి ఆదర్శమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రశంసించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం అవనిగడ్డ మూడో వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి ప్రతి షాప్‌కు తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీ దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గో రుముచ్చు ఉమా, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మహిళా కన్వీనర్ బిసాబచ్చిన విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ నలకుర్తి పృద్వీరాజ్, ఉపసర్పంచ్ గాజుల జై గోపాల్, ఎస్సీ సెల్ మచిలీపట్నం పార్లమెంట్ అధ్యక్షులు నలకుర్తి రమేష్, బీసీ నాయకులు వెంకటేశ్వరరావు, అవనిగడ్డ రంగనాథ్, ట్రేడ్ యూనియన్ నాయకులు గార్లపాటి గోపి, రాజశేఖర్, స్వామి, ఆలయం చైర్మన్ సింహాద్రి రామనాథం బాబు, లంకమ్మ అమ్మవారి టెంపుల్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.


జయహో బిసి మహాసభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సింహాద్రి రమేష్‌బాబు

ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-పెదపారుపూడి

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా వైఎస్సార్-జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో టి సీతామహాలక్ష్మి అధికారులను కోరారు. మండలంలోని మహేశ్వరపురం, దూళ్ళ వాని గూడెం గ్రామాల్లో లేఔట్లను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ లబ్ధిదారులు పూర్తిస్థాయిలో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ మల్లికార్జునరావు, ఏపీఓ వసంతరావు, విద్యుత్ ఏఈ వర కుమార్, ఏపీఎం నత్తా స్ఫూర్తి, విజయ రాజు, పంచాయతీ కార్యదర్శి డి సి హెచ్ శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎస్‌విఎల్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-అవనిగడ్డ

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎస్ వి ఎల్ క్రాంతి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు తెలిపారు. శనివారం కళాశాల వద్ద కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నవంబర్ 29న మైలవరంలో జరిగిన పోటీల్లో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని తెనాలి జ్యోతి, సీఈసీ ఫస్టియర్ విద్యార్థిని యు.లక్ష్మీనారాయణమ్మలు విశేష ప్రతిభ కనబరచడం ద్వారా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ చెప్పారు. ఈనెల 9 ,10,11, తేదీల్లో కర్నూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్‌వి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి-కంచికచర్ల

రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి విశేష కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు పేర్కొన్నారు. కేడీసీసీబీ నిధులు 52 లక్షల రూపాయలు వ్యయంతో కంచికచర్ల లో కెడిసిసి బ్యాంక్ బ్రాంచ్ విస్తరణలో భాగంగా నిర్మించిన మొదటి అంతస్తు భవనాన్ని శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్, కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేడీసీసీబీ ద్వారా రైతులకు పెద్ద ఎత్తున సబ్సిడీ రుణాలు, వ్యవసాయ రుణాలు మంజూరు చేస్తూ వారి అభివద్ధికి కూడా తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ మాట్లాడుతూ గత పాలకులు రైతు సంక్షేమాన్ని నిర్వీర్యం చేశారని, జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక రైతు ప్రభుత్వంగా మార్చారన్నారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, కేడీసీసీబీ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, డిసిసిబి డైరెక్టర్ బండి జానకి రామయ్య, జడ్పిటిసి వేల్పుల ప్రశాంతి, ఎంపిపి, వైస్ ఎంపీపీ లు షేక్ మలక్ బషీర్, బండి మల్లికార్జునరావు, గ్రామ సర్పంచ్ ఉప సర్పంచులు వేల్పుల సునీత, వేమా సురేష్ బాబు పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

వ్యకాస రాష్ట్ర మహాసభ గోడపత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : డిసెంబర్ 8, 9, 10 తేదీలలో జంగారెడ్డిగూడెంలో జరిగే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని షేర్ మొహమ్మద్ పేట గ్రామంలో శనివారం మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కోట కష్ణ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కోట కష్ణ మాట్లాడుతూ ఈ మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా 500 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని, రైతాంగ పోరాటాలు, భూ పోరాటాలు, కూలి పోరాటాలు అనేక పోరాటాలకు నిర్వహించినటువంటి ఉద్యమాలు చేసిన నాయకులు ఈ మహాసభల్లో పాల్గొంటున్నారన్నారు. భూ సమస్య పైన వివిధ రూపాలలో వ్యవసాయ కార్మిక సంఘం షేర్ మహ్మద్ పేట లో అనేకమైన సమరశీల పోరాటాలు నిర్వహించిందన్నారు. సంపన్న వర్గాలు ఆక్రమించుకున్న అసైన్డ్ సీలింగు, ఫారెస్ట్ భూములపై వ్యవసాయ కార్మిక సంఘం నిరంతరం పోరాడుతుందని ఆయన అన్నారు. అంతేకాకుండా పేదల ఇళ్ల స్థలాల కోసం ఉపాధి హామీ చట్టం కోసం, కూలి పోరాటాలు నిర్వహించిందని ఆయన అన్నారు. గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం పోరాట ఫలితంగా వ్యవసాయ కార్మికులకు కూలి రేటు పెరిగిందన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కరుణ, కూలీలు రజియా, లక్ష్మి, బేబీ తదితరులు పాల్గొన్నారు.

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

ప్రజాశక్తి-విజయవాడ : ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లో విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యదావిధిగా పని చేస్తాయని ఎపిసిపిడిసిఎల్, ఆపరేషన్ సర్కిల్ సూపరింటిండెంగ్ ఇంజినీర్ ఎం శివప్రసాదరెడ్డి తెలిపారు. ఈమేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ...విద్యుత్ బిల్లులు వసూలు కేంద్రాలు సెలవు రోజునా కూడా పని చేస్తాయని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఇ కోరారు.

నియామకపత్రం అందజేత

ప్రజాశక్తి వత్సవాయి : బీసీ సంక్షేమ సంఘం అభివద్ధికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం వెల్ఫేర్ ఉమెన్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా చేనీ కుమారి అన్నారు. వత్స వాయి మండలం మక్కపేట గ్రామంలోని ఓ కార్యక్రమానికి హాజరైన ఆమెకు శాసనసభ్యులు సామినేని ఉదయభాను నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ అభివద్ధికి ఎనలేని కషి చేయాలని పేర్కొన్నారు. ఈ గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, బీసీ సంక్షేమ సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-నందిగామ

నందిగామ మండలంలో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని నందిగామ ఎంఎల్‌ఎ మొండితోక జగన్మోహనరావు పేర్కొన్నారు. నందిగామ మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపిపి అరిగెల సుందరమ్మ అధ్యక్షతన జరిగింది.నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు మండలానికి సంబంధించి పలు అభివద్ధి పనులు – ఇతరత్రా అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాసరావు, ఏపీ ఆగ్రో డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి ,జడ్పిటిసి గాదెల బాబు,వైస్ ఎంపీపీలు ఆకుల రంగా , అన్నం పిచ్చయ్య పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న ఎంఎల్‌సి మొండితోక అరుణ్ కుమార్

ప్రజాశక్తి-నందిగామ : గ్రామీణ పేద విద్యార్థులు ,యువతీ -యువకులు పోలీసు ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో నందిగామలో ఉచిత కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ్ కుమార్ తెలిపారు. శనివారం నందిగామ ప్రెస్ క్లబ్లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎంఎల్సి మొండితోక అరుణ్ కుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థులు ఉద్యోగాలు సాధించడానికి ఎంతో ఖర్చుతో వేరే బయట ప్రాంతాలకు వెళ్లి శిక్షణ తీసు కుంటున్నారని, ఆర్థిక స్తోమత లేని వారు శిక్షణ తీసుకోకుండానే పరీక్షలు రాసి ఉద్యోగాలు దక్కించుకోలేక పోతున్నారని తెలిపారు. అలాంటి వారి కోసం పట్టణంలోని ఓసి క్లబ్‌లో డిసెంబర్ 10వ తేదీన పోలీసు ఉన్నతాధికారులతో ఉచిత కోచింగ్ సెంటర్ ను ప్రారంభిస్తామని తెలిపారు. కోచింగ్ సెంటర్లో ఉచితంగా 11 పాఠ్యపుస్తకాలు , ఉచితంగా మధ్యాహ్న భోజనం సదుపాయం కల్పిస్తామని తెలిపారు. కోచింగ్ సెంటర్‌లో చేరడానికి అర్హులైన ప్రతి ఒక్కరు నందిగామ ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిఆర్ కళాశాల అధ్యాపకులు వాసుదేవరావు , కో ఆప్షన్ సభ్యులు ఎంవై దాసు పాల్గొన్నారు.



ఘనంగా ఇన్ టు ప్లే స్కూల్ ఐదో వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్ : మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఇన్ టు ప్లే స్కూల్ ఐదో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ప్రముఖ న్యాయవాది చలసాని అజయ్ కుమార్, డాక్టర్ శరత్ చంద్ర డాక్టర్ అనిత విచ్చేసి పిల్లలను ఉద్దేశించి ప్రసంగించారు. పిల్లలను క్రమశిక్షణతో పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని వారు సూచించారు. పిల్లలకు విద్యతో పాటు అన్ని అంశాలపై శిక్షణ ఇస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు అని వారు పేర్కొన్నారు. ఇన్ టు ప్లే స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ చేకూరి రాజా మాట్లాడుతూ బట్టీపట్టి చదివే విద్యావిధానానికి దూరంగా ఉంటూ ఆట పాట తో విద్యను అందిస్తే పిల్లలు చదువుల్లో కచ్చితంగా రాణిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏడాదిన్నర వయసు నుంచి ఐదేళ్ల లోపు ఉన్న పిల్లలు ప్రదర్శించినా సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పలు తెలుగు హిందీ ఇంగ్లీష్ రీమిక్స్ పాటలకు చిన్నారులు చేసిన స్టెప్పులు అందరినీ ఉర్రూతలూగించాయి. ఈ కార్యక్రమంలో ఇన్ టు ప్లే స్కూల్ మేనేజింగ్‌డైరెక్టర్ నూతక్కి శ్రీలక్ష్మి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా చేపట్టాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-కంచికచర్ల : జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల త్వరితగతిన ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేయాలని నంది గామ ఆర్డీవో రవీంద్రరావు సూచిం చారు. కంచికచర్ల గ్రామ పంచాయతీ పరిధిలో 1, 4 జగనన్న కాలనీల్లో ఇళ్ళ నిర్మాణాలపై లబ్దిదారులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ వి రాజ కుమారి అధ్యక్షతన జరిగిన సమా వేశంలో ఆర్డీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ళు నిర్మాణం చేపట్టిన లబ్దిదారులకు ప్రభుత్వం సిమెంట్, ఇసుక, మంజూరు చేయడమే కాకుండా, డ్వాక్రా మహిళలకు అదనంగా 50 వేలు ఋణం మంజూరు చేస్తుందన్నారు. ఇప్పటికే కాలనీల్లో రోడ్లు, నీటి వసతి, కరంటు సరఫరా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కావున లబ్దిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ వీరభద్రయ్య, ఏఈ ఆకుల నరసింహారావు, ఎంపీడీవో కె బాల శంకరరావు, ఐకెపి ఏపిఓ భాస్కర్, అర్కార్యదర్శి ఐ శిరీష, కనగాల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : భగవద్గీత పోటీలలో నగరంలోని లిటిల్ బ్రెయిన్స్ పాఠశాల విద్యార్థిని బొందలపాటి మనస్విని అత్యుత్తమ ప్రతిభ కనపరచినట్లు పాఠశాల డైరెక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు నెలలో జరిగిన భగవద్గీత పరీక్షలో ప్రపంచ వ్యాప్తంగా వేలాది మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈపరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన బొందలపాటి మనస్విని బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా మనస్వినిని మైసూరులో జరిగిన కార్యక్రమంలో గణపతి సచ్చిదానంద గోల్డ్ మెడల్, సర్టిఫికెట్‌ను అందించినట్లు తెలిపారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్లలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ కట్టడాలపై సిఆర్డీఏ అధికారులు కొరడా కురిపించారు. స్థానిక జుజ్జూరు రోడ్డు లో జి ప్లస్ టు అనుమతి తీసుకుని, అక్రమంగా మరో రెండు అంతస్తుల నిర్మించారని సిఆర్డీఏ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో శనివారం సీఆర్డీఏ అధికారులు రంగ ప్రవేశం చేసి అనుమతులు లేకుండా నిర్మించిన భవనాన్ని కూల్చారు. అనుమతులు లేని మూడు, నాలుగు అంతస్తులు పగులగొట్టారు. సిఆర్డీఏ అధికారులు పూర్తి వివరాలు వెల్లడించడానికి నిరాకరించారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

- కలెక్టర్ ఎస్.డిల్లీరావు
- ఘనంగా శరత్ చంద్ర ఐఎఎస్ అకాడమీ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్ని రంగాలపై ఆసక్తి పెంపొందించుకుని ఆల్‌రౌండర్ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. విజయవాడలోని పద్మావతి పరిణయం కాన్ఫరెన్స్ హాల్‌లో శరత్‌చంద్ర ఐఎఎస్ అకాడమి వార్షికోత్సవ వేడుకలు శనివారం సాయంత్రం జరిగాయి. ఈసందర్భంగా కళాశాల విద్యార్థినీ, విద్యార్థులచే ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తాను సాధించబోయే లక్ష్యాన్ని ముందుగానే నిర్ణయించకుని ఆత్మవిశ్వాసంతో కృషి చేస్తే ఏరంగంలో అయినా విజయం సాధించవచ్చని తెలిపారు. ఐఎఎస్‌లో మంచి ర్యాంకు సాధించడం సులభమేనని కష్టపడాలని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ఇండియన్ రైల్వేస్ డివిజనల్ ఇంజనీర్ బి.విజయకీర్తి మాట్లాడుతూ విద్యతో పాటు సామాజిక అంశాలపై కూడా విద్యార్థులు పట్టు పెంచుకోవాలన్నారు. ఐటి డిపార్టుమెంట్ అసిస్టెంట్ కమీషనర్ జి.తిరుపతిరావు మాట్లాడుతూ యుపిఎస్‌సి సివిల్స్‌లో ర్యాంకు సాధించడం కష్టం కాదన్నారు. ఏరోజుకారోజు సబ్జెక్టులను చదువుకుంటూ మనం ఎంచుకున్న సబ్జెక్టు పట్ల పట్టు పెంచుకోవాలన్నారు. శరత్ చంద్ర ఐఎఎస్ అకాడమి మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్ చంద్ర మాట్లాడుతూ శరత్ చంద్ర ఐఎఎస్ అకాడమి ఇంటర్, డిగ్రీతో పాటు సివిల్స్‌లో కూడా శిక్షణ అందిస్తుందన్నారు. తమ వద్ద సివిల్స్‌లో జాతీయ స్థాయిలో ఎంతో మంది ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. గ్రూప్ -1 పరీక్షల్లో కూడా ఇటీవలే సుమారు 40 మంది అభ్యర్థులు అత్యున్నతస్థాయి పోస్టులకు ఎంపికయ్యారని తెలిపారు. ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఘనంగా ప్రపంచ వికలాంగుల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రపంచ 63వ వికలాంగుల దినోత్సవ కార్యక్రమాలు జిల్లావ్యాప్తంగా శనివారం జరిగాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : వికలాంగుల దినోత్సవాన్ని స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు వివిధ ఆటల, పాటల పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మండల విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం, ఇఒపిఆర్‌డి దిలీప్ కుమార్ చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఇఐఆర్‌పి విజయ కుమారి, సీజీలు, సీఆర్పీలు పాల్గొన్నారు. **గన్నవరం :** వైకల్యంతో కష్టాలను ఎదుర్కొంటూ జీవితాన్ని సాగిస్తున్న వారికి మనం అండగా ఉండాలని సీనియర్ న్యాయవాది, సిపిఎం మండల నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా గన్నవరం భవిత



గన్నవరంలో



కోడూరులో



ఉయ్యూరులో

కేంద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పలువురు న్యాయవాదులు, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. **పమిడిముక్కల :** వికలాంగులకు విద్యతోపాటు మంచి క్రమశిక్షణ నేర్పాలని పమిడిముక్కల మండల పరిషత్ అధ్యక్షురాలు కాసాని వేద సుప్రజ అన్నారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కపిలేశ్వరపురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రభాకరరావు, రజిని, సిఆర్‌పి రవితేజ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. **గుడివాడ :** స్థానిక భాస్కర థియేటర్ రోడ్డులోని భవిత సెంటర్‌లో ఎంపిపి గద్దే పుష్పరాణి, ఎంపిడిఒ రమణ, ఎంఇఒ బివిస్సి శేఖర్‌సింగ్ వికలాంగులను సత్కరించారు. ఉపాధ్యాయులు పి.లక్ష్మీస్రవంతి, వివిధ సంస్థంధ సంస్థల సభ్యులు శేఖర్, మాలిక్, భవిత సెంటర్ నిర్వాహకులు ఎం.కె నీలాంబరం, సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు. **హనుమాన్ జంక్షన్ :** బాపులపాడు మండలం వీరవల్లిలోని భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పి.అనిత, మండల విద్య శాఖాదికారి సిహెచ్.సక్సేనారాజు, ఎస్ఎంసి చైర్మన్ ఆర్.రంగమ్మ, లైబ్రరీ అధికారి భారతి, వీరవల్లి ఎంపిపి స్కూలు హెచ్ఎం బి.అంజనాదేవి, ఎంపిపి స్కూలు హెచ్ఎం టి.పుల్లయ్య, స్పెషల్ ఎడ్యుకేటర్ పి.చంద్రకళ, సిఆర్‌పి డి.వేళంగిణిమాత, భవిత కేంద్ర ఉపాధ్యాయులు కె.సుశీల, జె.నాగమణి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. **కోడూరు :** స్థానిక పరిషత్ కార్యాలయం వద్ద శనివారం ఆంధ్రప్రదేశ్ సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో వికలాంగులకు స్టూళ్లను పంపిణీచేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. సర్వ శిక్ష అభియాన్ ద్వారా కోడూరు మండలంలో 56 మంది ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు లబ్ధి పొందుతున్నారని సర్వ శిక్ష అభియాన్ వికలాంగులకు వీల్ చైర్స్, వినికిడి లోపం ఉన్న వారికి హియరింగ్ మిషన్స్, కంటి చూపు కోల్పోయిన విద్యార్థులకు బ్రెయిలీ కిట్స్ ఉచితంగా అందజేస్తున్నారని తెలిపారు. కోడూరు ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, కోడూరు గ్రామపంచాయతీ సర్పంచ్ వెన్నా షైని, కోడూరు పిఎసిఎస్ అధ్యక్షులు పరిసే మాధవరావు, వైఎస్ఆర్సిపి జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీర వెంకట నారాయణరావు, వార్డ్ మెంబర్ వెన్న ప్రసాద్, కోడూరు మండల తాసిల్దార్ ఎస్ కే లతీఫ్ పాషా కోడూరు సర్వ శిక్ష అభియాన్ (ఐ.ఈ.ఆర్.టి) బివిఎల్ రంగాదేవి తదితరులు పాల్గొన్నారు. **గన్నవరం :** మండల విద్యాశాఖ గన్నవరం ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆవరణలోని భవిత కేంద్రంలో మండల పరిషత్ అధ్యక్షులు అనగాని రవి , మండల విద్యా శాఖాధికారి శ్రీనివాస్, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో దావాజీగూడెంలోని స్పందన మానసిక వికాస కేంద్రంలో సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ అధ్యక్షత వహించారు. ఎంపిపి అనగాని రవి మాట్లాడారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ రజిత. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గౌసాని,ఆర్థిక నిపుణులు గన్నే వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాల లెప్ర సొసైటీ కోఆర్డినేటర్ మామిడి రాధిక మాట్లాడారు. రామలక్ష్మి, దావాజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.విజయరామరావు, సంస్థ సెక్రటరీ సంకాబత్తుల రజిత వెంకట్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దామెర సీతారామయ్య, గన్నవరం ఉంగుటూరు మాజీ వైస్ ఎంపిపిలు గొంది పరందామయ్య, అర్నేపల్లి సింహాచలం, ఉంగుటూరు ఎంపిపి సరోజినీ, గన్నవరం ఎంపిటిసి త్రిపురనేని లక్ష్మి నరసింహారావు(బాబి), కొండా, నేహ మెడికల్ షాపు అధినేత కె.సూర్యనారాయణమూర్తి, స్పందన బాలలు, తల్లిదండ్రులు,సిబ్బంది పాల్గొన్నారు. **కోడూరు :** ప్రపంచ 63వ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను కోడూరు మండల బీసీ సేన ఆధ్వర్యంలో స్థానిక 5 వ వార్డులో ఘనంగా నిర్వహించారు. బీసీ సేన కృష్ణా జిల్లా అధ్యక్షులు తిరుపతి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. వికలాంగుల సమస్యలపై పోరాడుతున్న అప్పికట్ల ఆది, కైతేపల్లి శివయ్య, తిరుపతి ఏడుకొండలను శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కేకును బీసీ సేన నాయకులు కట్ చేశారు. కోడూరు మండల బీసీ సేన అధ్యక్షులు కొండవీటి సురేష్ ,బీసీ సేన నాయకులు అద్దంకి పాండురంగారావు, ఉప్పు చిన్న వెంకటేశ్వరరావు, తిరుపతి వీరాంజనేయులు, యార్లగడ్డ ఓంకార్, బత్తుల శ్రీహరి,వేముల వెంకటేశ్వరరావు,తిరుపతి వెంకట నాంచారయ్య, కోడూరు మండల ముదిరాజ్ సంఘం యూత్ అధ్యక్షులు పేరే శ్రీనివాసరావు, బండారు రవీంద్రబాబు, తిరుపతి నాగేశ్వరరావు, మహిళలు, బీసీ సేన నాయకులు పాల్గొన్నారు. **ఉయ్యూరు:** వికలాంగుల పట్ల జాలిచూపడం కన్నా వారిలో మనోధైర్యం కల్పించి ప్రోత్సహించాలని మండల విద్యాశాఖ అధికారి టి.పద్మారాణి, ఇన్నర్ వీల్ క్లబ్ మాజీ అ్యక్షురాలు, సంఘ సేవకురాలు నర్రాసుధారాణి అన్నారు. ఉయ్యూరు మండల భవితా కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వికలాంగ బాలలకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బాలలకు అన్నసమారాధన చేశారు. వివిధ అంశాలలో పోటీల్లో విజేతలకు కొండపల్లి బొమ్మలు ప్రోత్సాహక బహుమతులుగా అందజేశారు. కొండపల్లి కృష్ణప్రసాద్, వార్డు కౌన్సిలర్ వెంకటలక్ష్మి, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు వాణి, అన్నేరాణి, ఉప్పాల పద్మ, టి.సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్‌జంక్షన్‌లో

ఉచిత కంటి వైద్యశిబిరానికి అనూహ్య స్పందన



ఉచిత వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-కోడూరు

కోడూరు మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామ పంచాయతీ, సాయి దుర్గ క్లినిక్ అండ్ ఆప్టికల్స్ కోడూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రామకృష్ణాపురం, ఊటగుండం గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రామకృష్ణాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ దేవనబోయిన కనకదుర్గ, దేవనబోయిన వెంకటేశ్వరరావు పాల్గొని కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడూరు లోని సాయి దుర్గ క్లినిక్ అండ్ ఆప్టికల్స్ వారు ఉచితంగా కంటి వైద్య శిబిరాన్ని రామకృష్ణాపురం గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసి ఇరాలి, ఊటగుండం, రామకృష్ణాపురం, బసవానిపాలెం గ్రామాల్లో కంటి సమస్యలతో బాధపడే వారికి ఒక సదవకాశాన్ని చూపారన్నారు. ఈసందర్భంగా శిబిరం నిర్వాహకులు సాయి దుర్గ క్లినిక్ అండ్ ఆప్టికల్స్ (కోడూరు) పొప్రెయిటర్ పూషడపు రామారావు మాట్లాడుతూ ఊటగుండం, రామకృష్ణాపురం గ్రామాల్లో నిర్వహించిన శిబిరాల్లో 236 మంది పాల్గొన్నారు. వారికి ఉచితంగా కంటి వైద్యం అందించి మందులు కూడా ఉచితంగా ఇచ్చామన్నారు. వీరిలో 36 మందికి ఐఓఎల్ ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కంటి వైద్య నిపుణులు బంగారు శరత్ బాబు, వైద్య సిబ్బంది ఉమా శ్రీ, షేక్ షధీర్, ఎండి. షధీర్, రమాదేవి, భాష పాల్గొన్నారు.

మసీదు నిర్మాణానికి రూ.25 లక్షలు : ఎంపి బాలశౌరి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్

మచిలీపట్నం జామియా మసీదులో నిర్మాణ పనులకు రూ.25 లక్షల ఎంపీ నిధులు(ఎల్ఎడిఎస్) కేటాయించినట్లు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి ప్రకటించారు. ఎన్నోఏళ్ళ నుండి ఇనకుదురు పేటలోని జామియా మసీదు అభివృద్ధి, నిర్మాణ పనుల నిమిత్తం ఎంపీ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.



నిధుల మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎంపి బాలశౌరి

మంజూరు పత్రాన్ని జామియా మసీదు కమిటీ ప్రెసిడెంట్ అంజద్ భాష, వైస్ ప్రెసిడెంట్ షేక్ ఖాదర్ వలీకు కమిటీ సభ్యుల సమక్షంలో అందచేశారు. ఇటీవల కాలంలో ఎంపీ కార్యాలయం సందర్శనలో పట్టణానికి చెందిన ప్రముఖ మైనార్టీ నాయకులు, ముస్లీం మత పెద్దలు కలిసి జామియా మసీదుకు నిధుల ఆవశ్యకతను గూర్చి వివరించారన్నారు. నిధులు మంజూరు చేసి ఫండ్ శాంక్షన్ పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. మైనార్టీ నాయకులు, ముస్లిముల పెద్దలు ఎంపీ బాలశౌరిను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు కమిటీ సభ్యులు సయ్యద్ బాజీ, హఫీజ్ భాషా, హఫజుల్లా, షరీఫ్, షేక్ చాంద్ భాషా, షేక్ అక్బర్ భాషా, షేక్ అస్మత్ భాషా, రషీద్ భాషా, చాంద్ భాషా, యాసిన్, షరీఫ్, యూనస్, షర్‌ఉద్దీన్ భాషా, వైకాపా కష్ణా జిల్లా అధికార ప్రతినిధి మాదివాడ రాము పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌కు మంగళాపురం విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-చల్లపల్లి

శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు చల్లపల్లి మండలం మంగళాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుడివాడలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో మంగళాపురం విద్యార్థులు విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ -17 విభాగంలో పరిశె అఖిల కృష్ణశ్రీ, గుర్రం రమ్య, అండర్ -14 విభాగంలో కుందుర్తి ఉమా నవ్యలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సాఫ్ట్ బాల్ అండర్ -17 విభాగంలో గుర్రం కార్తీక్, మట్టా జస్వంత్, అండర్ -14 విభాగంలో లీలా నాగసుబ్రహ్మణ్యంలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయి పోటీల్లో అండర్ -17 విభాగంలో డిస్కస్ త్రోలో పరిశె అఖిల కృష్ణశ్రీ ప్రథమస్థానంలో, పేరం వెంకట స్వాతి ద్వితీయస్థానంలో నిలిచారు. షాట్ ఫుట్‌లో పరిశె అఖిల కృష్ణశ్రీ ప్రథమస్థానంలో, మిట్టా నికిత తతీయస్థానంలో నిలిచారు. హేమర్ త్రోలో గుర్రం రమ్య ప్రథమ, నాగులపాటి పూజిత ద్వితీయ స్థానంలో నిలిచారు. జావెలిన్ త్రోలో బొమ్మ జ్యోతిసాయి ద్వితీయస్థానంలో నిలిచింది. అండర్ -14లో కుందుర్తి ఉమానవ్య డిస్కస్ త్రోలో ప్రధస్థానంలో, కోమటి శ్రావ్య షాట్ ఫుట్ లో ప్రథమస్థానం, కోమటి రామలక్ష్మి ద్వితీయ స్థానం సాధించారు. విజేతలను, రాష్ట్ర పోటీలకు ఎంపికైన వారిని పాఠశాల హెచ్ఎం వి.ప్రభాకర్, పీఈటీ కె.ఫణీంద్ర, ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

'చంపుతామని బెదిరిస్తున్నారు'

గన్నవరం : తనకు ప్రాణ రక్షణ కల్పించాలని, తనను రాజేష్, రామారావు అనే వ్యక్తులు చంపటానికి ప్రయత్నాలు చేస్తున్నారని గన్ను మారుతీ దేవీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను గన్నవరం బాలుర హైస్కూల్ లో నాలుగో తరగతి ఉద్యోగిగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. కొన్నేళ్ల క్రితం రామారావు అనే వ్యక్తి తోను కలిసి పనిచేసిన సమయంలో తన వద్ద డబ్బులు తీసుకున్నట్లు పేర్కొన్నారు. తన పేరుతో కారు కొనుగోలు చేశారని తెలిపారు. సుమారు రూ.6 లక్షల పైగా డబ్బులు తీసుకున్నాడని తెలిపారు. తమ ఇంట్లో అమ్మ, సోదరుడికి ఆరోగ్యం బాగోలేదనీ, డబ్బులు తిరిగి చెల్లించమని బ్రతిమలాడితే నీకు చేతనైంది చేసుకో డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని అంటున్నారని వాపోయారు. రామారావు కు తోడు రాజేష్ తనను బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేడు కవిత జాతీయ సాహిత్య పురస్కారాల ప్రదానం

ప్రజాశక్తి - అమరావతి : వివిధ సాహిత్య ప్రక్రియల్లో గొప్ప రచనలు చేసిన ఐదుగురు రచయిత్రులకు ఆదివారం ఉదయం జాతీయ సాహిత్య పురస్కారాలు అందచేయనున్నట్టు కవితా విద్యా సాంస్కృతిక సేవాసంస్థ నిర్వాహకులు అలపర్తి పిచ్చయ్య చౌదరి, బోయపాటి దుర్గాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని గాంధీనగర్ ఎన్జీవో హోమ్‌లో ఉదయం 10 గంటలకు పురస్కార ప్రదాన సభ ప్రారంభమవుతుంది. మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఎంఆర్ అరుణకుమారి, భండారు విజయ, పద్మావతి రాంభక్త, ఆచార్య కిన్నెర శ్రీదేవి, సమ్మెట ఉమాదేవిలకు సాహిత్య పురస్కారాలు ప్రదానం చేస్తారు. డాక్టర్ తూములూరి రాజేంద్ర ప్రసాద్, అక్కినేని వనజ, అలపర్తి రామకృష్ణ, వేంపల్లి షరీఫ్, బంగార్రాజు కంఠ, గంగవరపు సునీత, అలపర్తి విద్యాసాగర్ తదితరులు అతిథులుగా పాల్గొంటారని పిచ్చయ్య చౌదరి తెలిపారు.

ప్రజా చైతన్యం కోసం పాటుపడిన రామకృష్ణ

ప్రజాశక్తి -విజయవాడ రూరల్ : ప్రజా చైతన్యం కోసం కళ, సాహిత్య రంగల ద్వారా పాటుపడిన వ్యక్తి సంకా రామకష్ణ పలువురు అన్నారు. అలాంటి వ్యక్తి ఆకస్మికంగా మన నుంచి దూరం కావడం తీరని లోటని పేర్కొన్నారు.. ఇటీవల గుండెపోటుతో మతి చెందిన రామకష్ణ సంస్కరణ సభను నున్న హైస్కూల్ గ్రౌడ్స్ లో ది నున్న వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శని వారం జరిగింది . ఈ సందర్భంగా రామకష్ణ చిత్ర పటానికి పలు వురు వ్రాలవాలే ని నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో క్లబ్ అధ్యక్షులు పొలారెడ్డి సాం బిరెడ్డి మాట్లాడుతు తాను ఎంచుకున్న రంగం ద్వారా ఎన్నో కార్యక్రమలు చేసారని గుర్తు చేశారు. ఈకార్యక్రమం లో రామకష్ణ సహచరులు అరుణ కుమార్, వీరారెడ్డి, గోపాలం,తదితరులు ఆయన తో గడిపిన స్మతులు ను గుర్తు చేశారు. రామ కష్ణ స్వగహం లో జరిగిన కార్యక్రమం లో రైతు సంఘము నాయకులు గుంటక చిన్న వెంకటరెడ్డి, ప్రభాకర్, మా తంగి ఆంజనేయులు,గుంటక శ్రీనివాస రెడ్డి,దాసరి కామేశ్వరరావు, రామకష్ణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



డాక్యుమెంట్ పోయినది.

ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం మున్నలూరు గ్రామానికి చెందిన చావా నాగరాజు (తండ్రి) భద్రయ్య పేరుతో గల స్థిరాస్తి డాక్యుమెంట్ (దస్తావేజు) పోయినది. విజయవాడ నగరంలోని, మొగల్రాజపురం, రత్నమాంబ వీధిలో సర్వే నెంబర్ 6/6, 6/7, లో క్లాసిక్ టవర్స్ నందు ఫ్లాట్ నెంబర్ J3 దస్తావేజు.నెంబర్ 2624/2001 పటమట రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోనిది. ఈ ఏడాది ఆగస్టు నెలలో మున్నలూరు గ్రామం నుండి కంచికచర్ల కు నివాసం మార్చే సమయంలో ఇంటి సామగ్రి కంచికచర్ల కు తరలిస్తుండగా దస్తావేజుఉంచిన బ్యాగు మార్గమధ్యంలో జారి పోయినది. పై పేరుతో గల దస్తావేజు దొరికిన వారు ఈ నెంబర్ కు 9704009329 సమాచారం అందించగలరు.

IN THE COURT OF THE HON□BLE IV ASSISTANT CITY CIVIL JUDGE AT CHENNAI
O.S. No: 7044 OF 2021

M/s. SHARATH ENTERPRISES
REPRESENTED BY ITS PROPRIETOR:
Mr. M.S.SHARATH CHANDRA
No.8, Old No:14, SECOND STREET,
NANDANAM EXTENSION,
CHENNAI-600 035 ...PLAINTIFF

Versus

1. M/S VASAN GRAPHICS
Represented by its Managing Partner:
Mr. VENKATESWARA RAO
2. MR. VENKARESWARA RAO
Managing Partner: M/s Vasan Graphics
3. MRS. LAKSHMI
Partner: M/s Vasan Graphics
Wife of Mr. Venkateswara Rao,
All the defendants having the office:
D.No:26-20-6, II Floor, Swamy Street,
Gandhi Nagar, Vijayawada □ 520 003.
...DEFENDANT

TO
1. M/S. VASAN GRAPHICS
Represented by its Managing Partner:
Mr. VENKATESWARA RAO
2. MR. VENKARESWARA RAO
Managing Partner: M/s Vasan Graphics
3. MRS. LAKSHMI
Partner: M/s. Vasan Graphics
Wife of Mr. Venkateswara Rao,
All the defendants having the office:
D.No:26-20-6, II Floor, Swamy Street,
Gandhi Nagar, Vijayawada □ 520 003.
□Defendant

NOTICE

The Plaintiff above named has filed a Suit for recovery of a sum of Rs.56,618/- (Rupees Fifty Six Thousand and Six Hundred and Eighteen only) together with interest at the rate of 19% per annum towards the outstanding for the goods purchased. The Hon□ble IV Assistant City Civil Judge, Chennai was pleased to order notice through Publication returnable on 01.02.2023. Kindly appear before the Hon□ble IV Assistant City Civil Judge, High Court Campus, Chennai 600 104 on 01.02.2023 at 10:30 a.m. Failing which the suit will be decided in your absence.
Dated at Chennai this 2 nd day of December 2022

L. RAJASEKAR
Counsel for the Plaintiff.

IN THE COURT OF THE HON□BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT GUDIVADA
O.S. NO. 289/2016

Between :
Nidumolu Lakshmi Sakunthala ... Plaintiff
and
Mannem Padma (died) and Five orhters
... Defendants

పై నెంబరు దావాలో Defendants no. 3 to 6అనగా
D3 : Mannem Swathi, D/o Mannem, Eswara Rao, Hindu, aged 42 years, R/o Kowthavaram Village, Gudlavalleru Mandal, Krishna District.
D4 : Mannem Madhavi Latha, D/o Mannem Eswara Rao, Hindu, aged 40 years, R/o Kowthavaram Village, Gudlavalleru Mandal, Krishna District.
D5 : Mannem Madhavi, D/o Mannem Eswara Rao, Hindu, aged 38 years, R/o Kowthavaram Village, Gudlavalleru Mandal, Krishna District.
D6 : Mannem umari, D/o Mannem Eswara Rao, Hindu, aged 35 years, R/o Kowthavaram Village, Gudlavalleru Mandal, Krishna District.

వారికి శ్రీ కోర్టువారి ద్వారా పంపిన Summons serve కానందున, సదరు Summonsను Substitute service ద్వారా అమలు చేయుటకు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున పై నెంబరు దావాలోని Defendants Nos. 3 to 6 ది. 12-12-2022 తేదీన ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట ప్రత్యక్షంగా గానీ, లేక పరోక్షంగా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల పై నెంబరు దావాను పరోక్షంగా తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది: 12-12-2022

ఇట్లు
జి.ఎల్.ఎన్.వి.అప్పాజి, బి.కాం., బి.ఎల్.,
వాది తరఫు న్యాయవాది, గుడివాడ.

హింస నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి : సేఫ్

ప్రజాశక్తి - విజయవాడ : మహిళలపై, బాలికలపై హింస నిర్మూలనకు చేసిన చట్టాలను సక్రమంగా అమలు చేయాలని, అమలుకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని, నిధులు సమకూర్చాలని స్టెప్ ఎహెడ్ ఫర్ ఈక్వాలిటీ (సేఫ్) నేతలు డిమాండ్ చేశారు. స్థానిక గవర్నర్ పేట ఎంబీవికే భవన్‌లో శనివారం సంస్థ ప్రతినిధి, సామాజిక కార్యకర్త పి.ఏ. దేవి మాట్లాడుతూ ఏదైనా సంఘటన జరిగినప్పుడు ఒక చట్టం తీసుకొచ్చి కంటి తుడుపు చర్యగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని, వాటికి అవసరమైన వ్యవస్థను ఏర్పాటు చేయటం, నిధులు కేటాయించడం లేదని వివరించారు. సేఫ్ అధ్యక్షురాలు జి.జ్యోత్స్న మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి పిలుపుమేరకు నవంబర్ 25 నుండి డిసెంబర్ 10 వరకు మహిళలపై, బాలికలపై జరుగుతున్న హింసను నిర్మూలించాలని వివిధ కళాశాలల్లో, విద్యాలయాల్లో కార్యక్రమాలు జరుపుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్యదర్శి జి.వాణి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు డాక్టర్ ఏ.నీరజ, ఎం. శేషారత్నం, ఎ.రత్నలక్ష్మీ, వసుంధర, ఉషా, రత్నకుమారి పాల్గొన్నారు.

ఎంబివికె స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ : మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణా తరగుతులు శనివారం ప్రారంభమయ్యాయి. కమ్యునికేషన్ స్కిల్స్ నేర్పించడంలో విశేష అనుభవం కలిగిన బొడ్డపాటి చంద్రశేఖర్ ఈ కారక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంబివికె బాధ్యులు టి.క్రాంతికిరణ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఎంబి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం అనేక రకాల ఎకడమిక్ శిక్షణలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంబివికె విద్యావిభాగం బాధ్యులు యస్.పి.రామరాజు మాట్లాడుతూ ఇంగ్లీషు తప్పనిసరి మాధ్యమం అయిన నేటి పరిస్థితుల్లో స్పోకెన్ ఇంగ్లీషు తరగతులను వినియోగించుకోవాలని అన్నారు. ఎంబివికె బాధ్యులు యు.వి. రామరాజు మాట్లాడుతూ ప్రతీ రోజు సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు.

'సాదృశో'తో సిద్ధార్థ కళాశాల ఒప్పందం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పిబి సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్సెస్ విభాగం వారు హైదరాబాద్‌కు చెందిన "సాదశో టెక్నాలజీస్" అను సంస్థతో శనివారం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంతో పిబి సిద్దార్థా కళాశాలలో కంప్యూటర్ సైన్సె చదివిన విద్యార్థులకు వివిధ సాంకేతిక పరిజ్ఞానాలలో శిక్షణ ఇచ్చి ఆ తరువాత ఉపాధి కలిపిస్తామని సాదశో టెక్నాలజీస్ సంస్థ వ్యవస్థాపకులు, కార్యనిర్వహణ అధికారి ప్రకాష్ కాజా తెలిపారు. అంతే కాకుండా పాఠ్య ప్రణాళిక రూపొందించటం, పరిశోధనలు, నూతన కంప్యూటర్ పరిజ్ఞ్యానాన్ని విద్యార్థులకు, అధ్యాపకులకు బోధించటంలో సహాయ సహకారాలను అందిస్తామని తెలియజేశారు. పీ.బి. సిద్ధార్థా కళాశాల వివిధ సంస్థలతో కలిపి పనిచేయటానికి తన తోడ్పాటును అందిస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సాదశో టెక్నాలజీస్ సంస్థ వ్యవస్థాపకులు, కార్యనిర్వహణ అధికారి ప్రకాష్ కాజా, ప్రధాన అధ్యాపకులు డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ ఆచార్య రాజేష్ సి జంపాల, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టి.ఎస్ రవికిరణ్ పాల్గొన్నారు.

ఖోఖో పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - పెనమలూరు : తాడిగడప లోని సూర్య విద్యానికేతన్ విద్యార్థులు, సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థులపై ఖోఖో పోటీల్లో గెలుపొందారు. ఈ పోటీల్లో గెలిచిన వారికి ప్రిన్సిపాల్ మహమ్మద్ అలీ బహుమతులు అందజేసి అభినందించారు.



ఐక్య పోరాటాల ద్వారానే ఉద్యోగుల సమస్యల పరిష్కారం

మొదటి పేజీ తరువాయి

సిహెచ్.శ్రీరామ్ (స్త్రీ శిశు సంక్షేమం), సహాధ్యక్షులుగా బి.వి.రమణ (వైద్య ఆరోగ్య), కార్యదర్శిగా కె.సంపత్‌కుమార్ (పంచాయతీరాజ్), కార్యనిర్వహక కార్యదర్శిగా వి.వి.ప్రసాద్ (సమాచార), కోశాధికారిగా ఎస్‌కె. నాజీరుద్దీన్ (జలవనరుల), ఉపాధ్యక్షులుగా సిహెచ్. మధుసుదన్‌రావు (పాలిటెక్నిక్), బి. రాజాచౌదరి (వైద్య ఆరోగ్య), ఎస్‌కె.ఖాశీం సాహెబ్ (పశుసంవర్ధక), సిహెచ్.సి.వి.ఆర్.ప్రసాద్ (మలేరియా), సంయుక్త కార్యదర్శులుగా కె.ఆర్.ఎస్ గణేష్ (వాణిజ్య పనులు), సిహెచ్.ఎస్. రాధకృష్ణ (ఐటిఐ), పి శ్రీనివాస్‌రావు (పిఏవో), జి.వరప్రసాద్ (రెవెన్యూ), మహిళా సంయుక్త కార్యదర్శిగా బి.విజయశ్రీ (వైద్య ఆరోగ్య), డిఇసి నెంబర్లుగా కె.శివశంకర్ (ఆర్అండ్‌బి), ఏ.నాగరాజు (జైళ్లు), ఎ.రాంబాబు (ఏపిజిఎల్ఐ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మహారాజశ్రీ విజయవాడ 1వ అదనపు సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో
O.S. No. 157/2017 in I.A. No. 125/2022

Between :
Nannamu Prabhudas, S/o Late Kotaiah, R/o Raghava Estates, M.M. Towers, Srinivasapuram Colony, Plot No. 304, Edupugallu Village, Kankipadu Mandal, Krishna. .... Petitioner / Plaintiff
And
Kuremella Suvarna Bai & 7 Others
.... Respondents / Defendants
R-4 : Nannamu Nagamani W/o Late Nannamu Chittaranjan.
R-5 : Nannamu Haritha Devi, W/o Ramu, D/o late Nannamu Chittaranjan.
R-6 : Nannamu Harikiran S/o Late Nannamu Chittaranjan
R-7 : Nannamu Hari Chandana D/o Late Nannamu Chittaranjan
Respondents 4 to 7 are R/o D.No. 28-25-11, Nasurulla Khan Street, Arundal Peta, Vijayawada.-520002.

పై నెంబరు పిటీషన్‌లోని నానమూ చితరంజన్ దాస్ గారు చనిపోయినందున వారి వారసులుగా 4 టు 7 రెస్పాండెంట్స్‌ను ప్రతివాదులుగా చేర్పించమని పై నెంబరు పిటీషన్ దాఖలు చేసుకొని యున్నారు. సదరు పిటీషన్‌లో రెస్పాండెంట్స్‌కు ఎట్టి అభ్యంతరములు వున్న యెడల తెలుపుకొనే నిమిత్తం ది. 14-12-2022వ తేదీన ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి యెదుట స్వయంగా గానీ, లేక ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయటమైనది.

ఇట్లు
టి.అజయ్‌కుమార్,
జి.టి.వి.వి.సతీష్,
అడ్వకేట్స్, విజయవాడ- 520003.

మహారాజశ్రీ గుడివాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం. 57/2017

బిట్వీన్ :
1) పునుకొల్లు రత్నకుమారి అండ్ అదర్స్
.... వాదులు
మరియు
1) పునుకొల్లు పార్థసారథి అండ్ అదర్స్
.... ప్రతివాదులు
డి5) పునుకొల్లు నాగ విజయపావని, భర్త: అజయ్‌బాబు, హిందువు, వయస్సు 34 సం॥లు, డోర్ నెం. 14/205, గుడివాడ
డి6) డొక్కు లక్ష్మి, భర్త : లేటు శ్రీనివాసరావు, హిందువు, వయస్సు 46 సం॥లు, గృహిణి, డోర్ నెం. 1-23-3, పుట్టగుంట గ్రామం, నందివాడ మండలం.

పై నెంబరు దావాలో శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం ప్రతివాది నెం. 5 మరియు 6 వారికి సమనులు పేపరు ప్రకటన ద్వారా సర్వు చేయించుటకు దావాను ది. 12-12-2022 వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు తేదీన ప్రతివాది నెం.5 మరియు 6 వారలు స్వయంగా గానీ, వారి అడ్వకేటుగారి ద్వారా గాని ఉదయం 10-30 గం.లకు పై కోర్టులో హాజరు కావలెను. అట్లు హాజరు కాని యెడల పై నెంబరుగ ల దావా ప్రతివాది నెం.5 మరియు 6 వారలకు వ్యతిరేకంగా తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయటం అయినది.

(శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం)
గుడివాడ
ది.3-12-2022

ఎస్.వి.పాండురంగారావు,
అడ్వకేట్, గుడివాడ.
ఫోన్ : 08674 - 242789

గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్

బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్‌లో గడప గడపకు - మన ప్రభుత్వం కార్యక్రమంలో గన్నవరం శాసనసభ్యులు డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ శనివారం పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్రాగునీటి సమస్య, పారిశుధ్యం, విద్యుత్,గ్రామంలోని రోడ్లు, పెన్షన్లు, ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, మొదలైన అంశాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గన్నవరం నియోజకవర్గంలోని ప్రజలందరికీ మేలు చేయటానికి తనవంతుగా నిరంతరం కృషిచేస్తున్నానని వివరించారు. సిఎం వైఎస్ జగన్‌తో మాట్లాడి నియోజక వర్గానికి అత్యధిక నిధులు వచ్చేలా కృసిచేస్తున్నానని వివరించారు.




సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీ

పై వంతెనల నిర్మాణానికి ప్రాధాన్యత : బాలశౌరి

ప్రజాశక్తి-గుడివాడ

దశాబ్దాలుగా గుడివాడ ప్రజలకు ఉన్న ప్రధాన సమస్య భీమవరం వెళ్లే రైల్వే లైన్ గేట్లపై ఫ్లైఓవర్ బిడ్జిల నిర్మాణాన్ని పూర్తిచేయటం ప్రజల చిరకాల వాంఛ అని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి అన్నారు. శనివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో రైల్వే గేట్లపై రూ.317 కోట్లతో నిర్మించనున్న రైల్వేపై ఓవర్ల నిర్మాణ పనులకు వల్లభనేని బాలశౌరి, మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని),జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక భూమి పూజ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ గత ప్రభుత్వాల అనాలోచిత విధానాల వల్లనే గుడివాడలో ఫ్లై ఓవర్ల సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఈ బిడ్జిల నిర్మాణం హేమా హేమీల వల్ల కానిది, ఎంపీ బాలశౌరికి సాధ్యమైందన్నారు. గుడివాడ నియోజకవర్గంలో చిరస్థాయిగా ఎంపీ బాలశౌరి పేరు నిలిచిపోతుందన్నారు. పూర్తి స్థాయి మౌలిక వసతులతో డిసెంబర్ 21న టిడ్కో ఇళ్ళను లబ్ధిదారులకు అప్పగిస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పెద్ద మనస్సుతో గుడివాడ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మాజురు చేశారన్నారు. ఎంపి బాలశౌరి మాట్లాడుతూ గుడివాడలో దశబ్దాల కల నేడు సాకారమైందన్నారు. కొడాలి నాని సూచనలతోనే గుడివాడలో అద్భుతమైన డిజైన్‌తో బ్రిడ్జికు రూపకల్పన చేశామన్నారు. రూ.1500 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర రవాణా శాఖ అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎంపి బాలశౌరి, ఎమ్మెల్యే కొడాలి నాని

భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-పమిడిముక్కల

ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు వేగవంతంగా నిర్వహించాలని పమిడిముక్కల మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొలమంచిలి మహేష్ అన్నారు. పమిడిముక్కల మండలంలోని హనుమంతపురం గ్రామంలో శనివారంనాడు ఆయన రైతు భరోసా కేంద్ర నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కొడమంచిలి మహేష్ మాట్లాడుతూ గ్రామ సచివాలయ నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయన్నారు. హనుమంతపురంలో రైతు భరోసా కేంద్రం నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని కోరారు. పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి రాష్ట్రంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో హనుమంతపురం గ్రామ సర్పంచ్ కలపాల రాంబాబు, వంశీకృష్ణ, సచివాలయం ఇంజనీర్ మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న వైస్ ఎంపిపి కొడమంచిలి మహేష్

సిఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-గుడివాడ

స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో సీఎం కప్ ప్రైజ్ మనీ టోర్నమెంట్ క్రీడా పోటీలను మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరావు(నాని), జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారికలు ప్రారంభించారు. అనంతరం స్థానిక స్టేడియంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో వారు మాట్లాడారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న సిఎం కప్‌ను విజయవంతం చేయాలని కోరారు. క్రికెట్,బ్యాడ్మింటెన్, వాలీబాల్, కబాడ్డీ విభాగాల్లో ప్రతిభను కనబర్చి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. క్రీడాకారులకు రూ.50 లక్షల వరకు ప్రైజ్ మనీ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కొడాలి నానిలు క్రీడాకారులతో ఆటలు ఆడుతూ, పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నందివాడ ఎంపిపి పెయ్యిల ఆదాం, స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, వైసీపి పట్టణ, రూరల్ మండల అధ్యక్షులు గొర్ల శ్రీను, మట్టా జాన్‌విక్టర్, తదితరులు పాల్గొన్నారు.




క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపి బాలశౌరి, ఎమ్మెల్యే కొడాలి

ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-గుడివాడ

స్థానిక మెయిన్‌రోడ్డులోని శ్రీవిఘ్నేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల కమిటీ చైర్మన్‌గా గంటా చంద్రశేఖర్, ధర్మకర్తల కమిటీ సభ్యుల ద్వారా దేవాదాయ శాఖ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. శనివారం దేవస్థాన పూజ మండపంలో నిర్వహించిన అభినందన సభలో నూతన కమిటీ సభ్యులను వైసీపి నాయకులు మండలి హనుమంతరావు, ఎం.వి.నారాయణరెడ్డి, మాజీ కౌన్సిలర్ జోగా సూర్యప్రకాష్‌రావు అభినందించారు.



ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-బంటుమిల్లి

బంటుమిల్లి మండలంలోని చిన్నతుమ్మిడి గ్రామంలోని శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి వారి దేవస్థానం పునర్నిర్మాణ పనులకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామాత్యులు జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ శనివారం శంకుస్థాపన చేశారు. బంటుమిల్లి ఎంపీపీ వెలివెల చిన్న బాబు, బంటుమిల్లి మండల కన్వీనర్ మల్లీ శెట్టి రాజబాబు, మట్టా నాగబాబు, గుడి చైర్మన్ మారగాని అశ్విని రామ్, మద్దల నరేష్, వైసిపి నాయకులు, దేవాదాయశాఖ అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న జోగి రాజీవ్



పరిశీలిస్తున్న అధికారులు

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత : అధికారులు

ప్రజాశక్తి-మోపిదేవి

హౌసింగ్ డే సందర్భంగా మోపిదేవి మండల స్థాయి అధికారులు సిబ్బంది శనివారం మండల పరిధిలోని లేఔట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నాగాయతిప్ప, మోపిదేవి శివారు రావి వారి పాలెం లే అవుట్లను ప్రజా ప్రతినిధులతో కలిసి అధికారులు పరిశీలించారు. గృహ నిర్మాణ లబ్ధిదారులు ఆయా లేఔట్లలో మౌలిక అవసరాలైన రహదారులు, విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోపిదేవి తహశీల్దార్ కె.నవీన్ కుమార్, ఎంపీడీవో డి.పార్వతి, హౌసింగ్ ఏఇ ఆర్.తాండవ కృష్ణ, నాగాయతిప్ప గ్రామ సర్పంచ్ గరికపాటి వెంకటేశ్వరరావు, కోసూరు వారి పాలెం గ్రామ ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్ బాబు, వైసిపి నాయకులు లింగం జగదీష్ కుమార్, పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ బి.శ్రీనివాస్, నాగాయ తిప్పగ్రామస్తులు కోసూరు ప్రభు కుమార్, రెవెన్యూ, హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవనిగడ్డ హౌసింగ్ డిఇ బానోజీరావు, మోపిదేవి, నాగాయలంక లేఔట్లు పరిశీలించి హౌసింగ్ కార్యాలయాల్లో రికార్డులు తనిఖీ చేశారు.

ఆర్‌బికెలలోనే ధాన్యాన్ని విక్రయించాలి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

రైతులు రైతు భరోసా కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని కృష్ణాజిల్లా కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ గడిదేసి పెద వెంకయ్య కోరారు. మచిలీపట్నం మండలం పెదపట్నం గ్రామపంచాయతీ రైతు భరోసా కేంద్రంలో శనివారం గ్రామ సర్పంచ్ జి.అనూష, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్ పంట కొనుగోలు పై రైతులకు రెవెన్యూ, గోకవరం పీ ఏ సీ ఎస్ బ్యాంకు వారు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద వెంకయ్య మాట్లాడుతూ దళారీ చేతుల్లో నుండి రైతులను కాపాడే ఉద్దేశంతో ప్రభుత్వం నేరుగా రైతు భరోసాలకు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పిఎసిఎస్), పాడి పర్చేస్ సెంటర్‌కు అనుసంధానం చేసిందన్నారు. ప్రభుత్వమే నేరుగా రైతులు దగ్గర నుండి కొనుగోలు చేసి 21 రోజుల్లో రైతు వ్యక్తిగత అకౌంట్లో నగదు జమ చేస్తుందన్నారు. రైతు భరోసా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు గడిదేశి రాజు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎంతోమేలు చేకూరుతుందన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యాకూబ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రవల్లిక, కో-ఆపరేటివ్ బ్యాంక్ సెక్రటరీ మట్ట భాస్కరరావు, పంచాయతీ సెక్రెటరీ శ్రీహరి, పెద్ద ఎత్తున రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రమాదకర విద్యుత్ స్తంభం మార్పు

- కార్పొరేటర్ సత్యబాబు చొరవతో కదిలిన విద్యుత్ అధికారులు



ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు క్వారీ కొండ ప్రాంతంలో విద్యుత్ స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉన్న విషయాన్ని స్థానిక కార్పొరేటర్ బోయి సత్యబాబు విద్యుత్ అధికారులు ఏడి, ఏఈ దృష్టికి తీసుకెళ్ళటంతో పాటు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 2వ తేదీన 'ప్రజాశక్తి'లో 'విద్యుత్ స్తంభాన్ని మార్చాలి" అని ప్రచురించిన వార్తకు స్పందించిన సంబంధిత విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి శనివారం కూలటానికి సిద్ధంగా వున్న విద్యుత్ స్తంభాన్ని మార్పు చేశారు. స్పందించి విద్యుత్ స్తంభాన్ని మార్పు చేసిన అధికారులు, సిబ్బందికి 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు కతజ్ఞతలు తెలియజేశారు.



క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న సబ్ కలెక్టర్

భవానీ దీక్ష విరమణ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - వన్‌టౌన్

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి, దుర్గమ్మ దేవాలయం ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ నుండి 19 తేదీ వరకూ నిర్వహించు శ్రీ అమ్మవారి భవానీ దీక్షా విరమణ నేపథ్యంలో సబ్ కలెక్టర్ అదితి సింగ్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా దుర్గగుడి ఆలయ కార్యనిర్వహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ దేవస్థానంలో ఈనెల 15 నుండి 19 వరకు నిర్వహించు శ్రీ అమ్మవారి భవానీదీక్షా విరమణ మహోత్సవాలు-2022 ఏర్పాట్లులో భాగంగా వినాయక స్వామి వారి గుడి నుండి క్యూ లైన్లు, కేశఖండన, స్నానపు ఘాట్లు, ప్రసాదం కౌంటర్లు ఏర్పాట్లు, పార్కింగ్ ప్రదేశాలు తదితర ఏర్పాట్లను సబ్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులకు సబ్ కలెక్టర్ వివిధ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ ఏసిపి కె. హనుమంతరావు, ఆలయ కార్యనిర్వాహక ఇంజినీర్ లింగం రమాదేవి, రెవిన్యూ, డిఎం అండ్ హెచ్‌ఓ ఇక్బాల్ హుస్సేన్, విఎంసి సర్కిల్-1 ఇఇ నారాయణరావు, ఇతర అధికారులు, మరియు ఆలయ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

లారీ యజమానులందరికీ సమాన హక్కు కల్పించాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

బూడిద ఎగుమతి సమయంలో ప్రతి లారీ ఓనర్‌కు సమన్యాయం కలిగించాలనే ముఖ్య ఉద్దేశంతో ఏర్పాటు చేసిన నూతన డాక్టర్ ఎన్‌టిటిపియస్ లారీ ఓనర్ అసోసియేషన్ సొసైటీ కార్యాలయాన్ని జనసేన మండల అధ్యక్షులు పోలిశెట్టి తేజ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూడిద లోడింగ్ విషయంలో ఎలాంటి అవకతవకలు జరుగకుండా చూడడానికి ఈ సొసైటీ ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుందని చెప్పారు. భవిష్యత్తులో ఎన్‌టిటిపియస్ యాజమాన్యంతో చర్చించి జనసేనపార్టీ తరుపున, లారీ యూనియన్ తరుపున చీఫ్ ఇంజనీర్ లోడింగ్ సమస్యలపై చర్చించి వినతిపత్రం అందజేస్తామని లారీ ఓనర్లకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. స్టేట్ లారీ ఓనర్ అసోసియేషన్ పెద్దలు మరియు కృష్ణాజిల్లా ఓనర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

యానిమేటర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి-ఏ కొండూరు

వెలుగు డిపార్ట్మెంట్లో యానిమేటర్స్‌గా విధులు నిర్వహిస్తున్న మహిళలపై రాజకీయ వేధింపులు ఆపాలని ఎన్టీఆర్ జిల్లా యానిమేటర్ల సంఘం గౌరవ అధ్యక్షురాలు ఎ. కమల అన్నారు శనివారం మండలంలోని చీమలపాడు గ్రామంలో ఎన్టీఆర్ జిల్లా యానిమేటర్ల మూడో మహాసభ ఆళ్ల ఉమాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో కమల మాట్లాడుతూ యానిమేటర్ల పదవీ కాల పరిమితి మూడు సంవత్సరాల ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 15 డ్వాక్రా గ్రూపులలో లోపు ఉన్న సంఘాలకు 2021 ఏప్రిల్ నుండి జీతాలు పెండింగ్లో ఉన్నాయని, ఆ పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలన్నారు. వివోఎల సమస్యలపై నిరంతరం ఆందోళనలో పోరాటాలు కొనసాగిస్తున్నామని, ఆందోళన కార్యక్రమాల్లో వివోఏలు అందరూ కలిసికట్టుగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. వివోఏలకు కనీస వేతనం చెల్లించాలని ఉద్యోగ భద్రత లాంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 15 16 తేదీల్లో సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా మహాసభలో విజయవాడలో జరుగుతున్నాయని వివోఏలు అందరూ పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని ఆమె కోరారు. మహాసభ అనంతరం యానిమేటర్ల నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా నుతన కమిటీ గౌరవఅధ్యక్షురాలుగా ఏ కమల, ప్రధాన కార్యదర్శిగా ఆళ్ల ఉమాదేవి, అధ్యక్షురాలిగా షేక్ చాంద్ బేగం, ఉపాధ్యక్షురాలుగా ఎం విజయలక్ష్మి, కమిటీ సభ్యులుగా కే ఉమా, సహాయ కార్యదర్శిగా డి కళ్యాణి, షేక్ మున్ని, కోశాధికారిగా సిహెచ్ సురేష్‌తో సహా 15 మందిని నూతన కమిటీగా ఎన్నుకున్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏ కొండూరు మండల కార్యదర్శి సిఐటియు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏ. కమల

చిల్డ్రన్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - వన్‌టౌన్

విజయవాడ చిల్డ్రన్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ వన్‌టౌన్ మరియు భవానీపురం డివిజన్ నూతన కార్యవర్గం 2022-23కు ఎన్నికయ్యింది. కమిటీ నూతన అధ్యక్షునిగా లయన్ రాజు డేవిడ్ దొంతలూరి, కార్యదర్శిగా బి.కె.శిరీష, కోశాధికారిగా ఎస్.కె. ఖాదర్ బాషా, మెంటార్‌గా యరడ్ల ఆంజనేయరెడ్డి, గౌరవ సలహాదారుగా ఎన్‌వి.రావు, ఉపాధ్యక్షులుగా ఎస్. ఈశ్వరరావు, కె.దినేష్‌రెడ్డి, వి. బ్రహ్మారెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.కె. జిలానీ, పి.విజయలక్ష్మి, ఎం.డి. జావీద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బడ్జెట్ పాఠశాలల సమస్యలపై చర్చించారు. రికగ్నిషన్‌ను పది సంవత్సరాల నుండి మూడు సంవత్సరాలకు తగ్గించుట, టీసీలు ఇవ్వకుండా,అనుమతి లేకుండా డ్రాప్ అవుట్‌లు పెట్టే సమస్య, ఆటస్థలం కోసం ఎదుర్కొంటున్న సమస్యలపై అలాగే ఉత్తమ విద్యా వ్యవస్థకై సూచనలు , సలహాలపై చర్చించారు. బడ్జెట్ పాఠశాలల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని నూతనంగా ఎన్నికైన కమిటీ తీర్మానం చేసినట్లు కమిటీ అధ్యక్షులు లయన్ రాజు డేవిడ్ దొంతలూరి తెలిపారు.



ఎన్నికైన స్కూల్ అండ్ ట్యుటోరియల్స్ కమిటీ నూతన కార్యవర్గం

పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి బాలుర హైస్కూల్‌ని శనివారం ఆకస్మిక తనిఖీ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ చేశారు. పాఠశాల మొత్తం పర్యవేక్షించారు. ప్రభుత్వ నిర్వహిస్తున్న విద్యావిధానం అమలుపై పర్యవేక్షణ నిమిత్తం పాఠశాలను సందర్శించినట్లుగా స్కూల్స్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద గల వద్ధులకు, వికలాంగులకు, యాచకులకు రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బోలా రామకష్ణ ఆధ్వర్యంలో శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ నూతలపాటి చెన్నకేశవరావు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేశం పార్టీ నాయకులు, యువత నాయకులు పాల్గొన్నారు.

ప్రజలను ముంచిన 'సంకల్ప సిద్ధి'

వీక్షణం



సిపి మీడియా సమావేశంలో నిందితులు (నిల్చొన్నవారు)

మనీ సర్క్యులేషన్ స్కీం పద్ధతిలో ప్రజలను మోసగించే సంస్థలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. గతంలో క్వాంటమ్, పియర్‌లెస్, ఫ్యూచర్ మేకర్ లైఫ్ కేర్ గ్లోబల్ మార్కెటింగ్ ప్రైవేటు లిమిటెడ్, క్వెస్ట్ నెట్ ఇంటర్నేషనల్ మార్కెటింగ్ ప్రైవేటు లిమిటెడ్ తదితర సంస్థల పేరుతో మనీ సర్క్యులేషన్ స్కీమ్‌లను ఏర్పాటు చేసి అమాయక ప్రజల వద్ద నుండి అధిక మొత్తంలో నగదును సేకరించి, సంస్థలను మూసి వేశారు. వీటి వల్ల ప్రజలు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా కొంతమంది ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడుతోంది. అనేక చట్టాలు, ఆర్‌బిఐ నిబంధనలున్నా... నిత్యం ఏదో ఒక కంపెనీ ప్రజలను నిట్టనిలువునా ముంచుతోంది.

ఈ కోవలోకి చెందినదే ఇటీవల విజయవాడ కేంద్రంగా వెలుగుచూసిన "సంకల్ప సిద్ధి ఈకార్ట్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్" కంపెనీ. ఈస్కీమ్‌కు పై పేర్కొన్న లక్షణాలన్నీ ఉన్నాయి. అయితే దీనిలో రాజకీయ నేతల ప్రమేయం ఉందని వార్తలు రావడం చర్చనీయాశమైంది. అధికార పార్టీకి చెందిన ఇద్దరు నేతలకు సంబంధం ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ కేసులోని ఆరుగురు నిందితులకు రాజకీయ నేతలతో సంబంధాలు ఉన్నట్లుగా చెబుతున్నారు. ముఖ్యంగా గన్నవరం, గుడివాడకు చెందిన ప్రజాప్రతినిధులతో ఇద్దరు కీలక నిందితులైన గుత్తా కిరణ్, గుత్తా గోపాలకృష్ణలకు పరిచయాలు ఉన్నాయని టిడిపి నేతల ఆరోపణగా ఉంది. నిందితుడు గుత్తా వేణుగోపాలకష్ణ మనీ సర్క్యులేషన్ స్కీమ్‌ను నిర్వహిస్తూ ప్రజలకు ఒకటికి మూడు రెట్లు డబ్బులు ఇస్తానని అత్యాశ చూపి మోసం చేశాడు. భార్యతోపాటు చెల్లి, సోదరుడు వరుసైన వారితో వ్యవహారాలు నడిపాడు. కరోనా తర్వాత 2021 అక్టోబర్లో విజయా టాకీస్ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా సంకల్ప్ మార్ట్‌ను ప్రారంభించాడు. సూపర్ మార్కెట్ ఏర్పాటు చేసి కిరణా, ఎర్ర చందనం మొక్కలు, బంగారం, భూమి, నగదు వంటి మార్గాల ద్వారా ప్రజల నుండి డబ్బులు వసూలు చేశాడు. ఆన్‌లైన్ ట్రేడింగ్, మార్కెటింగ్, వినియోగ వస్తువుల ఎగుమతులు దిగుమతులు వంటి చట్ట బద్ధమైన వ్యాపారం చేస్తానని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌ఒసి) నుండి అనుమతులు పొంది ఆ అనుమతులతో చట్ట విరుద్ధమైన మనీ సర్క్యులేషన్ స్కీం నడిపాడు. ఈ ఏడాది మే నుండి సంకల్ప సిద్ధి ఈకార్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ ద్వారా మనీ సర్క్యులేషన్ స్కీంను కొనసాగించాడు. ఒక వినియోగదారుడు కొత్త వ్యక్తులను ఈ స్కీంలో చేర్పిస్తే సదరు వ్యక్తికి గిఫ్ట్‌లు ఇస్తామని ప్రకటించాడు. ఎక్కువ మందిని చేర్చిన వారికి కమీషన్‌తోపాటు వారికి లభ్యమైన స్థాయిని బట్టి కారు, బైకు, ఫోన్లు, వెండి వస్తువులను గిఫ్ట్‌గా ఇస్తానని నమ్మించాడు. ఈపథకాలకు ఆకర్షితులైన ప్రజలు చాలా మంది దీనిలో చేరారు. ఇలా సేకరించిన సొత్తును నిందితులు తమ స్వప్రయోజనాల కోసం దారి మళ్లించారు. నిందితులు కోట్లాది రూపాయల మేర లావాదేవీలు నడిపినట్లు పోలీసులు గుర్తించారు. సుప్రీంకోర్టు ఇటువంటి స్కీంలను నేరంగా పరిగణిస్తూ వివిధ సందర్భాల్లో తీర్పులను వెలువరించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) వారు కూడా ఇటువంటి స్కీంల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. పిరమిండ్ స్కీం, మనీ సర్క్యులేషన్ స్కీం పరిధిలోకి ఏ తరహా నేరాల కిందకు వస్తాయో విశదీకరించింది. మనీ సర్క్యులేషన్ స్కీం, పిరమిడ్ స్ట్రక్చర్ కింద డబ్బులను అంగీకరించడమనేది ప్రైజ్ సిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్ (బానింగ్) యాక్స్ - 1978 ప్రకారం పట్టదగిన నేరమని ఆర్‌బిఐ పేర్కొంది. ఈ కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు పట్టుకోగలిగినా రాజకీయ నేతల ప్రమేయం గురించి ఆరా తీయాల్సి ఉంది. అలాగే ప్రజలు ఇటువంటి గొలుసు కట్టు పథకాలను నమ్మి మోసపోకుండా జాగ్రత్త వహిచాల్సిన అవసరం ఉంది.

- ఎం.బి.నాథన్